PRABHATA SURYA

# ప్రభాత సూర్య

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

వేల రూ.5/ - పేజీలు : 8 శుక్రవారం 29 ఆగస్టు 2025 సంపుటి: 01, సంచిక : 79

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## వెండి కూడా బంగారం లెక్కనే.. అమల్లోకి రానున్న కొత్త రూల్స్..

కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వెండి ఆభరణాలకు కూడా బంగారం మాదిరిగానే హాల్‌మార్కింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టనుంది. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 1 నుండి అమల్లోకి రానుంది. ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశ్యం కస్టమర్లు కొనుగోలు చేసే వెండికి స్వచ్ఛత హామీ ఇవ్వడం. ప్రస్తుతానికి ఈ హాల్‌మార్కింగ్ స్వచ్ఛందంగా ఉంటుంది. అంటే వినియోగదారులు కోరుకుంటే హాల్‌మార్క్ చేసిన వెండిని కొనుగోలు చేయవచ్చు లేదా హాల్‌మార్క్ లేని వెండిని కూడా కొనవచ్చు. అయితే భవిష్యత్తులో ఇది తప్పనిసరి అయ్యే అవకాశాలు లేకపోలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news




# జల విలయం

## కామారెడ్డి జిల్లాలో కుంభవృష్టి.. అర్గొండలో 43.35 సెం.మీ అత్యధిక వర్షపాతం

- 11 మండలాల్లో 30 సెం.మీ. నుంచి 43 సెం.మీ. దాకా నమోదు
- భారీ వర్షాలతో మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల తదితర జిల్లాలు అతలాకుతలం
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు..అలుగు పారుతున్న చెరువులు
- వరదలు, వర్షాలతో ముగ్గురు మృతి, ఆరుగురు గల్లంతు
- జల దిగ్బంధంలో గ్రామాలు.. వందలాది మందిని కాపాడిన సహాయక బృందాలు
- రహదారులను ముంచెత్తిన భారీ వరద..ముంపులో జాతీయ రహదారులు
- కశ్మీర్ టు కన్యాకుమారి ఎన్‌హెచ్ 44కు కోతలు..రాకపోకలకు అంతరాయం
- పలుచోట్ల కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్‌లు.. నిలిచిపోయిన రైళ్లు
- అధికారులతో సీఎం రేవంత్ సమీక్షబీ ముంపు ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- సహాయక చర్యల్లో కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు, బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్

ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా కురిసిన కుంభవృష్టి కామారెడ్డి జిల్లాలో బీభత్సం సృష్టించింది. జల ప్రళయాన్ని తలపిస్తూ.. బుధవారం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం అర్గొండలో 24 గంటల్లో 43.35 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. 2023 జూలైలో ములుగు జిల్లా వెంకటాపూర్‌లో కురిసిన 64.9 సెంటీమీటర్ల తర్వాత ఇదే అత్యధిక వర్షపాతం కావడం గమనార్హం. అటు మెదక్, నిర్మల్ జిల్లాలను కూడా వాన ముంచెత్తింది. సిద్దిపేట, సిరిసిల్ల, ములుగు, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాలను సైతం భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. కన్యాకుమారి – కశ్మీర్ నేషనల్ హైవే 44 సహా పలుచోట్ల ప్రధాన రహదారులు కోతకు గురికావడం, - మిగతా2లో



## ఎన్డీయేకు 324.. 'ఇండియా'కు 208

- ఇండియా టుడే-సీ ఓటర్ మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వేలో వెల్లడి
- ఈ ఏడాది జూలై 1 నుంచి ఆగస్టు 14 దాకా ఈ సర్వే
- సీవోటర్ రెగ్యులర్ ట్రాకర్ డేటా ద్వారా మరో 1,52,038 మంది అభిప్రాయాలు సేకరణ
- పార్టీల పరంగా చూస్తే బీజేపీకి సొంతంగా 260 సీట్లు, కాంగ్రెస్‌కు సొంతంగా 97 సీట్లు వస్తాయని వెల్లడి




## ప్రతి కుటుంబంలో ముగ్గురు పిల్లలు ఉండాలి

- రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్
- జనాభా స్థిరీకరణతోపాటు క్షీణతను నిరోధించడానికి ఇది దోహదపడుతుంది
- జనాభా పెరుగుదల ఓ వరమైనప్పటికీ.. కొంత భారమే
- అందరికీ ఆహారం సహా అన్ని వసతులు అందించాలి
- జనాభా నియంత్రణ విధానం ఉన్నది అందుకే.




## ట్రంప్ సుంకాలపై కేంద్రం కసరత్తు

- అమెరికాయేతర మార్కెట్లకు విస్తరణ
- 40 కీలక దేశాల గుర్తింపు.. భారతీయ ఉత్పత్తుల ఎగుమతుల పెంపునకు కార్యాచరణ
- ఎగమతిదార్లను ఆదుకోవడం కోసం రూ.25 వేల కోట్లతో మిషన్
- స్టాక్‌మార్కెట్లపై సుంకాల ప్రభావం.. రెండు రోజుల్లో రూ.9.6 లక్షల కోట్ల నష్టం

## త్వరగా ఎన్నికలకు వెళ్లటమే మేలు!

- ప్రభుత్వ పరంగా జీఓ ఇచ్చి ముందుకెళ్లటం వైపే మొగ్గు..?
- సీఎంతో మంత్రుల కమిటీ భేటీలో మెజారిటీ అభిప్రాయం
- ప్రభుత్వానికి మూడు సిఫారసులు చేసిన మంత్రుల కమిటీ
- విస్తృతంగా చర్చ జరిగినా తుది నిర్ణయానికి రాలేకపోయిన నేతలు
- మరింత లోతుగా చర్చించేందుకు మరోసారి భేటీకి నిర్ణయం




హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో కాంగ్రెస్ పార్టీ వైఖరి ఇంకా తేలలేదు. ఢిల్లీలో న్యాయ నిపుణులతో సంప్రదింపులతోపాటు గత రెండు రోజులుగా జరిగిన మంత్రుల బృందం భేటీ.. సీఎం, పీసీసీ అధ్యక్షుల సమ క్షంలో జరిగిన చర్చల్లోనూ తుది నిర్ణయానికి రాలేక పోయారు. ఈ నేపథ్యంలో మరో రెండుమూడు రోజుల తర్వాతే పార్టీ వైఖరి స్పష్టమవుతుందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో సంప్రదింపుల కోసం పీసీసీ ఏర్పాటు చేసిన మంత్రుల బృందం మూడు ప్రత్యామ్నాయాలను - మిగతా2లో

# యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

- వరదలతో దెబ్బతిన్న రోడ్లు, చెరువులు పునరుద్ధరించాలి
- అందుకోసం వెంటనే అంచనాలు తయారు చేయండి
- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించండి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- మెదక్, కామారెడ్డి జిల్లాల వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- వరదలపై హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష



హైదరాబాద్/పెద్దపల్లి/మెదక్‌జోన్

భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తక్షణ మే అంచనాలు తయారు చేసి అత్యవసర నిధులతో పనులు చేపట్టాలని సూచించారు. వరదల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం వరదలతో అతలాకుతల మైన కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. భారీ వర్షాలతో బుధ, గురువారాల్లో - మిగతా2లో



## 31న జిన్‌పింగ్‌తో మోదీ భేటీ

- వచ్చే నెల 1న పుతిన్‌తో సమావేశం
- భారత్-చైనా సంబంధాలు, పరస్పర సహకారంతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై వారు చర్చించే అవకాశం
- భారత్-అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు ఒత్తిడికి లోనవుతున్న నేపథ్యంలో చైనా, రష్యా అధినేతలతో భారత ప్రధానమంత్రి ప్రత్యేకంగా సమావేశం కాబోతుండడం ప్రాధాన్యం

## 'విద్యుత్' ఉద్యమంపై బుల్లెట్

బషీర్‌బాగ్ కాల్పులకు పాతికేళ్లు

ప్రజాఉద్యమంగా మారిన విద్యుత్ చార్జీల వ్యతిరేక ఉద్యమం

కాల్పుల ఘటనతో నాటి చంద్రబాబు పాలనకు చరమగీతం



హైదరాబాద్

బషీర్‌బాగ్ షహీద్‌చౌక్.. విద్యుత్ చార్జీల వ్యతిరేక ఉద్యమానికి సాక్షీభూతంగా నిలుస్తోంది. సరిగ్గా పాతికేళ్ల క్రితం.. 2000 సంవత్సరం ఆగస్టు 28న ఉమ్మడి ఏపీ సీఎంగా చంద్రబాబు ఉన్న సమయంలో హైదరాబాద్ నడిబొడ్డున బషీర్‌బాగ్‌లో పోలీస్ కాల్పుల్లో ముగ్గురు నెలకొరిగారు. ఈ కాల్పుల ఘటనతో నాటి చంద్రబాబు ప్రజావ్యతిరేక పాలనకు 'కౌంట్‌డౌన్' మొదలైంది. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభు త్వం గ్రామీణ ప్రాంతాలు, - మిగతా2లో

## గవర్నర్లు జడ్జిలు కాదు

బిల్లులపై న్యాయ సమీక్ష వాళ్ల పని కాదు

తమిళనాడు తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు



# యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

-మొదటిపేజీ తరువాయి

పోటెత్తిన వరదలతో కామారెడ్డి, మెదక్ జిల్లాలో అపార నష్టం వాటిల్లిందని సీఎంకు రెండు జిల్లాల కలెక్టర్లు నివేదించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద హెలికాప్టర్ దిగి వరదల పరిస్థితిపై సమీక్షించారు. అనంతరం నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టులను ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డిలో హెలికాప్టర్ దిగి జిల్లా కలెక్టర్తో సమీక్షించాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించకపోవటంతో సాధ్యం కాలేదు. దీంతో మెదక్ జిల్లా చేరుకుని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం హెలికాప్టర్ను మెదక్ ఎస్పీ కార్యాలయంలో దించి జిల్లాలో వరదల పరిస్థితిపై అక్కడే సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వరద పరిస్థితిని కలెక్టర్ సీఎంకు నివేదించారు. వరద సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం బాగా పని చేసిందని సీఎం కితాబిచ్చారు. సమీక్షలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎంపీ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు. మెదక్ నుంచే సీఎం కామారెడ్డి జిల్లా కలెక్టర్కు ఫోన్ చేసి వరద పరిస్థితులపై ఆరా తీశారు. సత్వరం సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరద నష్టంపై అత్యవసరంగా కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పిస్తామని మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.



### అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవా లని సీఎం ఆదేశించారు. గురువారం ఉదయం తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు శ్రీధర్బాబు, సీతక్కతో కలిసి వరద పరిస్థితిపై సమీక్షించారు. హైదరాబాద్ నగరంతోపాటు అన్నిచోట్లా శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వినాయక మండపాల వద్ద విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లతో భక్తులకు ప్రమాదం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్లో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. చెరువులు, కుంటలకు గండ్లు పడే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశు ద్ధ్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఆస్పత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవడంతోపాటు అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్బృందాల సాయం తీసుకోవాలని సీఎస్ను ఆదేశించారు.

### మామ స్వాతిముత్యం.. అల్లుడు ఆణిముత్యం

మామ స్వాతిముత్యం.. అల్లుడు ఆణిముత్యంలా రూ.లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఎన్నో లోపాలు ఉన్నాయని సీఎం రేవంత్రెడ్డి విమర్శించారు. గురువారం పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిందని, ఏనాడో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టే ప్రస్తుతం తెలంగాణకు వరప్రదాయినిగా మారిందని అన్నారు. మామ, అల్లుడు కాళేశ్వరం ప్రాజెక్టును గొప్పగా నిర్మించామని చెప్పుకుంటున్నారని, వాళ్లలా తాము 80 వేల పుస్తకాలు చదవలేదని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్రావుపై సెటైర్ వేశారు. యూరియాపై ఎప్పటికప్పుడు బఫర్ స్టాక్ డిస్ప్లే చేస్తున్నామని సీఎం తెలిపారు. తదుపరి పంటలకు సైతం కొందరు రైతులు యూరియాను నిల్వ చేసుకోవడంతో కొరత ఏర్పడిందని చెప్పారు. సీఎం వెంట మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ఠాకూర్ మక్కాన్సింగ్ ఉన్నారు.

## త్వరగా ఎన్నికలకు వెళ్లటమే మేలు!

-మొదటిపేజీ తరువాయి

పార్టీ ముందుంచినట్టు తెలిసింది. ఈ మూడింటిని గురువారం జూబ్లీహిల్స్లోని క్యాంపు కార్యాలయంలో ముఖ్య మంత్రి రేవంత్రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్కుమార్గౌడ్ సమక్షంలో జరిగిన సమావేశంలో మంత్రుల బృందం వివరించింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రుల బృందం సభ్యులు మల్లు భట్టి విక్రమార్క, ఎన్. ఉత్తమ్కుమార్రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్బాబు, ధనసరి సీతక్కలు పాల్గొన్నారు. మూడు ఆప్షన్లపై చర్చించినా తుది నిర్ణయానికి రాలేకపోయారని తెలిసింది. అయితే, మెజారిటీ నాయకులు మాత్రం ప్రత్యేక జీవో ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తేనే మంచిదని అభిప్రాయపడ్డారు. బీసీ వర్గాలకు న్యాయం చేసే విషయంలో హడావుడిగా నిర్ణయం తీసుకునేదాని కంటే పార్టీ పరంగా ఎలా ముందుకెళ్లాలన్న దానిపై మరింత కూలంకషంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ నెల 30న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ ఈ అంశంపై చర్చించి మంత్రుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. బుధవారం గాంధీభవన్లో మంత్రుల బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో మీనాక్షి నటరాజన్, మహేశ్కుమార్గౌడ్తోపాటు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్కుమార్రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్బాబు, సీతక్క, వాకిటి శ్రీహరి, పార్టీ నేతలు వి.హనుమంతరావు, పి. వినయ్కుమార్, ఈరవత్రి అనిల్ పాల్గొని ఢిల్లీ న్యాయ నిపుణులు ఇచ్చిన అభిప్రాయాల మేరకు మంత్రుల బృందం చేయాల్సిన సిఫారసులపై చర్చించారు.

### మంత్రుల బృందం సిఫారసులివే..!

' స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేస్తూ రాష్ట్రపతి ఆమోదానికి పంపిన ఆర్డినెన్సుకు మరో నెలరోజుల్లో మూడు నెలలు పూర్తవుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదం విషయంలో రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు కేసు కూడా ఈలోపు ఓ కొలిక్కి వస్తుంది. అప్పటివరకు వేచి చూస్తే బాగుంటుంది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున ప్రభుత్వ పక్షాన కొంత గడువు కోరుతూ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయాలి. ఆర్డినెన్సు ఆమోదం విషయంలో కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ పోరాటం చేయాలి. వేచి చూసే అవకాశం లేకపోతే ప్రభుత్వ పరంగానే బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ప్రత్యేక జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలి. ఈ ఉత్తర్వులపై ఎవరైనా కోర్టులకు వెళితే కులగణన ఆధారంగా వచ్చిన శాస్త్రీయ గణాంకాలను కోర్టు ముందుంచి పోరాడాలి. కోర్టులు కూడా వెంటనే నిర్ణయం తీసుకోకుండా కేవియట్ దాఖలు చేయాలి. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లాలి.

' ఈ రెండు ప్రతిపాదనలు కాదంటే పార్టీ పరంగానే 42 శాతం రిజర్వేషన్లను ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలి.

### సింఘ్వీ సలహానే సరైందా..?

గురువారం సీఎం రేవంత్ సమక్షంలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో వీలున్నంత త్వరగా ఎన్నికలు నిర్వహించడమే మంచిదనే అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. అయితే, పార్టీ పరంగా మరింత దృఢంగా వ్యవహరించాలని, బీసీ వర్గాలకు న్యాయం చేసే విషయంలో వెనక్కు తగ్గవద్దనే చర్చ కూడా వచ్చింది. ఈ నేపథ్యంలో పార్టీ ఎంపీ, న్యాయ కోవిదుడు అభిషేక్ మనూ సింఘ్వీ ఇచ్చిన సలహా మేరకు సుప్రీంకోర్టులో కేసు తేలేవరకు వేచి ఉండడమే మంచిదనే అభిప్రాయం వ్యక్తమైనట్టు తెలిసింది.

# జల విలయం

-మొదటిపేజీ తరువాయి

అనేకచోట్ల వంతెనలు, కాజ్వే లు కొట్టుకు పోవడంతో పట్టణాలు, గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వందేళ్ల చరిత్ర కలిగిన పోచారం ప్రాజెక్టును వరద ముంచెత్తగా డ్యామ్కు ఒకవైపు గుంత పడటంతో ఒకదశలో ప్రాజెక్టు తెగిపోతుందేమోనన్న భయాందోళనలు వ్యక్తం అయ్యాయి. ముందుజాగ్రత్తగా మూడు గ్రామాలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించారు. మరోవైపు ఎన్నడూ లేనివిధంగా ఎగువ మానేరు ఉగ్రరూపం దాల్చింది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగు పారుతున్నాయి. రైల్వే ట్రాక్లు సైతం కోతకు గురి కావడంతో పట్టాలు వరదలో తేలుతున్నట్టుగా కన్పించాయి. వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు మరణించగా, ఆరుగురు గల్లంతయ్యారు. రాష్ట్రంలో వర్షాలు వరదల పరిస్థితిని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, జిల్లాల అధికారులతో సమీక్షించారు. ఏరియల్ సర్వే ద్వారా ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

### కామారెడ్డి కకావికలం

కుండపోతగా కురిసిన వర్షంతో కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. కామారెడ్డి పట్టణం చిగురుటాకులా వణికిపోయింది. కాలనీల్లో ఇళ్లు నీట మునిగాయి. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 24 గంటల్లో జిల్లాలోని 11 మండలాల్లో 30 సెం.మీ. నుంచి 43 సెం.మీ. దాకా వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. వేలాది మంది వరద ముంపుబారిన పడ్డారు.

జాతీయ రహదారులతో పాటు జిల్లా రహదారులు, గ్రామీణ రహదారులు, వంతెనలు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు, వరదలు సృష్టించిన బీభత్సంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఒకరు గల్లంతయ్యారు. రాజంపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గోడ కూలి ఇప్పకాయల పల్లె దవాఖాన వైద్యుడు వినయ్ (28) ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లిన బీబీపేట మండలం జనగామకు చెందిన రైతు రాజిరెడ్డి (63) ఎడ్లకట్టవాగులో గల్లంతయ్యాడు. గురువారం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. బీబీ పేట మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన బాలరాజు వరదలో గల్లంతవగా ఆయన ఆచూకీ దొరకలేదు. జిల్లాలోని బీబీ పేట చెరువుకు గండిపడింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండు ఎన్డీఆర్ఎఫ్, ఆరు ఎస్డీఆర్ఎస్ బృందాలు 25 చోట్ల రెస్క్యూ చేసి 775 మందిని కాపాడారు.

### మెతుకుసీమ అతలాకుతలం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెతుకుసీమ కకావికలమైంది. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. ముఖ్యంగా హవేలీ ఘన్పూర్ మండలంలో వర్షం బీభత్సం సృష్టించింది. మెదక్ నుంచి రాజుపేట వైపు వెళ్తున్న ఓ ఆటో గంగమ్మ వాగులో కొట్టుకుపోవడంతో ఇందులో ప్రయాణిస్తున్న రాజుపేటకు చెందిన బెస్త సత్యనారాయణ మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన యాదగౌడ్ ఆచూకీ ఇంకా లభించలేదు.

వాస్తవానికి వీరిద్దరు వాగులో ఉన్న ఓ చెట్టుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నం చేశారు. అయితే వరద ఉధృతికి వీరు కొట్టుకుపోయారు. మరోవైపు ఇదే మండలంలోని నక్కవాగులో ఓ కారు కొట్టుకుపోయింది. అందులో ఉన్న నరేందర్గౌడ్ ఓ పొదను పట్టుకుని 100కు ఫోన్ ద్వారా లొకేషన్ పంపడంతో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు. గంగమ్మ వాగుపై రాజుపేట బ్రిడ్జిపై 8 మంది చిక్కుకుపోగా, వీరిని కూడా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి.

దూప్సింగ్ తండాను వరద నీరు ముంచెత్తింది. నిజాంపేట మండలం చల్మెడలోని సోమయ్య చెరువు, బ్రాహ్మణ చెరువు నిండిపోయి గ్రామాలను ముంచెత్తే ప్రమాదం ఉండటంతో చెరువు కట్టకు గండి పెట్టి నీటిని దిగువకు వదిలేశారు. కొల్చారం మండలంలోని తుక్కాపూర్లో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లిన టేక్మాల్ మల్లప్ప భార్య ప్రమీల మంజీర నదిలో గల్లంతయ్యింది.

గురువారం మధ్యాహ్నం వరకు అందిన వివరాల ప్రకారం..జిల్లాలో 49 రోడ్లు తెగిపోయాయి. 24 కాజ్వేలు, కల్వర్టులు కూలిపోయాయి. 21 బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. 22 చెరువులకు గండ్లు పడ్డాయి. మెదక్, రామాయంపేట పట్టణాలతో పాటు, పలు గ్రామాల్లో 20 కాలనీల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. 6,341 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

### జలదిగ్బంధంలో రామాయంపేట

రామాయంపేటలో రెండురోజుల్లో 20 సెం.మీ వరకు వర్షం కురిసింది. పట్టణంలోని శ్రీనగర్కాలనీ, అక్కలగల్లి, బీసీ కాలనీ ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రామాయంపేట %–% కామారెడ్డి%–% సిద్దిపేట మార్గంలో వరద నీరు చేరడంతో ట్రాఫిక్కు అంతరాయం కలిగింది. ఎస్సీ మహిళా డిగ్రీ కాలేజీ హాస్టల్లో నీరు చేరడంతో 50 మంది విద్యార్థినులను తాళ్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ పర్యటించారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు.

### రైతులు, ఇటుక బట్టీ కార్మికుల రెస్క్యూ

మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న భారీవర్షాలతో రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుకు బుధవారం వరద పోటెత్తింది. రికార్డు స్థాయిలో వచ్చిన నీటితో మానేరు పరవళ్లు తొక్కుతోంది. దిగువన ఉన్న పరీవాహక వాగులో ఒక రైతు గల్లంతు కాగా.. ఐదుగురు రైతులు, ఇద్దరు ఇటుక బట్టీ కార్మికులు ప్రవాహంలో చిక్కుకున్నారు. గురువారం భారత వైమానిక దళ హెలికాప్టర్ సాయంతో రైతులను, కార్మికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

గేదెల కోసం వెళ్లిన గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య అనే రైతు వరదలో గల్లంతయ్యాడు. నర్మాలకు చెందిన పలువురు రైతులు పశు వులను తోలుకెళ్లి వాగులో చిక్కుకుపోయారు. అదే ప్రాంతంలో ఉన్న ఇటుకబట్టీలో పనిచేస్తున్న మహారాష్ట్రకు చెందిన ఇద్దరు కార్మికులు అక్కడే ఉండిపోయారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బీ గీతే వరదలో చిక్కుకుపోయిన వారికి డ్రోన్ల ద్వారా ఆహార పదార్థాలు పంపించారు.

### బండి సంజయ్ చొరవ

కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో భారత వైమానిక దళానికి చెందిన హెలీకాప్టర్ సాయంతో రైతులను, కార్మికులను ఒడ్డుకు చేర్చారు. గురువారం సంఘటన స్థలానికి చేరుకున్న సంజయ్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్తో కలిసి రైతులతో మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఎగువ మానేరుకు వచ్చి వరద ఉధృతిని పరిశీలించారు.

మధ్యాహ్నం ఆర్మీ హెలీకాప్టర్లు బాధితులను రక్షించేంతవరకు ఆయన ఘటనాస్థలంలోనే ఉండటం గమనార్హం. కాగా వరదలో గల్లంతైన నర్మాలకు చెందిన పంపుకాడి నాగయ్య నివాసానికి సంజయ్ వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. నాగం కుమారుడు సాయికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు.

### నీటమునిగిన నిర్మల్

నిర్మల్ జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకు భారీ నుంచి అతిభారీ వర్షం కురిసింది. నిర్మల్ పట్టణంలో పలు కాలనీలు నీటమునిగాయి. జిల్లాలోని లక్ష్మణచాంద మండలంలో మునిపల్లి శివారులోని గోదావరి కుర్రులో చిక్కుకుపోయిన పశువుల కాపరి శంకర్ను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి కాపాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామం వద్ద రోడ్డు మీదుగా ఉధృతంగా వరద నీరు ప్రవహించడంతో సుమారు 24 గంటల పాటు వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

### తెగిన ఎన్హెచ్%- 44..

కశ్మీర్ టూ కన్యాకుమారి ఎన్హెచ్%–%44 పై పలుచోట్ల రోడ్డు, వంతెనలు తెగిపోవడంతో జాతీయ రహదారిపై బుధ, గురువారాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ జిల్లా నార్సింగి వద్ద వరద 44వ నంబర్ జాతీయ రహదారిని వరద ముంచెత్తింది. దీంతో హైదరాబాద్ – నిజామాబాద్ మార్గంలో పలుచోట్ల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ %–% సిద్దిపేట రహదారిపై నిజాంపేట వద్ద ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో ఈ రూట్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ రహదారిపై పోచారం ప్రాజెక్టు పొంగి ప్రవహించడంతో వంతెన దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి జిల్లా భిక్కనూరు టోల్ప్లాజా వద్ద జాతీయ రహదారిపై భారీగా వరద నీరు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు కామారెడ్డి%–%భిక్కనూరు మండలాల సరిహద్దులో జంగంపల్లి వద్ద జాతీయ రహదారిపైకి భారీగా వచ్చిన వరద నీటితో రోడ్డు కోతకు గురైంది. సదాశివనగర్ మండలం కల్వరాల వద్ద కూడా ఎన్హెచ్ 44 కోతకు గురైంది. టేక్రియల్ వంతెన కోతకు గురైంది. హైదరాబాద్%–%నిజామాబాద్ ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోయాయి.

### కొట్టుకుపోయిన రైల్వే లైన్లు

సికింద్రాబాద్%–%నిజామాబాద్ రైల్వే లైనుపై పలు చోట్ల మట్టికొట్టుకుపోయి ట్రాక్లు గాలిలో వేలాడడంతో రైళ్లను రద్దు చేశారు. మెదక్ జిల్లా శమ్నాపూర్ దేవుని చెరువు నీళ్ల ధాటికి రైల్వే ట్రాక్ కోతకు గురైంది. దీంతో అక్కన్నపేట %–% మెదక్ మార్గంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి జిల్లా తలమడ్ల సమీపంలో కూడా ట్రాక్ కోతకు గురికావడంతో సికింద్రాబాద్%–% మన్మాడ్ మా ర్గంలో రైళ్లు నిలిచిపోయాయి. ఈ రూట్లో రైళ్లు పునరుద్ధరించాలంటే రెండు రోజులైనా పట్టే అవకాశాలున్నాయని అంటున్నారు.

### భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో..

భూపాలపల్లి జిల్లా ఎగువనుంచి వరద నీరు వస్తుందటంతో మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మహాముత్తారం మండలంలోని పెగడపల్లి, కేశవపూర్ మధ్య గల పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బ మల్హర్ మండలంలోని తాడిచర్ల ఓపెన్కాస్ట్లో 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోగా, భూపాలపల్లి ఏరియాలో మంగళవారం, బుధవారం కురిసిన వర్షానికి ఓపెన్కాస్ట్ 2,3 ప్రాజెక్టుల్లో 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లినట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు. ములుగు జిల్లా మొండ్యాల తోగు వద్ద జాతీయ రహదారి వరద తాకిడికి భారీగా కోతకు గురైంది. ఊరట్టం తూ ముల వాగు వరద తాకిడికి బ్రిడ్జి సమీపంలో రోడ్యాం వద్ద సీసీ రోడ్డు కోతకు గురైంది. రంగాపూర్ పెద్ద చెరువు కట్ట తెగిపోయింది.

జల దిగ్బంధంలో సిద్దిపేట

రెండు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో సిద్దిపేట జిల్లా కేంద్రం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. ఎగువ నుంచి కోమటి చెరువుకు వరద నీరు చేరడంతో పొంగి పొర్లుతోంది. దీంతో పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, హరిప్రియానగర్, శ్రీనివాసనగర్, సీతారామంజనేయ థియేటర్ జలమయంగా మారాయి. హరిప్రియానగర్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వరద నీరు చేరడంతో..వరద ప్రవాహంలోనే రోగులను స్ట్రెచర్పై మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గజ్వేల్లోని లక్ష్మీప్రసన్న కాలనీ, ఎలైట్ ప్రజ్వల్ కాలనీ కూడా నీట మునిగాయి.

కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గజ్వేల్%–%దుబ్బాక మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గజ్వేల్ పట్టణంలోని ఎర్రకుంట పొంగి పొర్లుతుండటంతో వరద నీరంతా తూప్రాన్ రోడ్డు వై జంక్షన్ వద్ద నిలిచి 33/11 కేవీ సబ్ స్టేషన్ జలమయంగా మారింది. వరద ముంపులో చిక్కుకున్న సిద్దిపేట జిల్లా అక్బర్పేట%–%భూంపల్లి మండలం చిన్ననిజాంపేట గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు 22 గంటల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపారు. అనంతరం ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పడవ ద్వారా వారిని ఒడ్డుకు చేర్చారు.

### పోచారం ప్రాజెక్టుకు తప్పిన ముప్పు

కామారెడ్డి జిల్లాలోని పోచారం ప్రాజెక్టుకు భారీ ముప్పు తప్పింది. భారీ వర్షాలతో ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టు పైభాగం నుంచి నీరు పడడంతో స్ట్రక్చర్కు ఒకచోట గొయ్యి ఏర్పడింది. ప్రాజెక్టు తెగిపోయినట్టేనని అందరూ భావించారు. కానీ వరద తీవ్రత తగ్గడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

### రైలుకు ఎదురెళ్లి నిలిపేసిన గ్యాంగ్మన్

గ్యాంగ్మన్ అప్రమత్తతతో పెద్ద రైలు ప్రమాదం తప్పింది. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో బుధవారం కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని రామేశ్వర్పల్లి%–%తిప్పాపూర్ మధ్య 528 మైలురాయి వద్ద రైల్వే ట్రాక్ కింద ఉన్న మట్టికట్ట 50 గజాల మేర కొట్టుకుపోయింది. దీంతో రైలు పట్టాలు గాల్లో వేలాడుతున్నాయి. గ్యాంగ్మన్ రమేష్ దీన్ని గమనించి అప్రమత్తమయ్యాడు. భిక్కనూరు నుంచి వస్తున్న కాచిగూడ%–%పెద్దపల్లి ప్యాసింజర్ రైలుకు ఎదురుగా వెళ్లి అది ఆగిపోయేలా చూశాడు. ట్రాక్ కొట్టుకుపోయిన విషయాన్ని లోకో పైలట్కు తెలియజేయడంతో ఆయన స్టేషన్ మాస్టర్ భానుశేఖర్కు సమాచారం అందించారు. ఆయన ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడంతో వారు వెంటనే సికింద్రాబాద్%–%నిజామాబాద్ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసి, కొన్ని రైళ్లను వేరే మార్గంలోకి మళ్లించారు. కాచిగూడ%–%పెద్దపల్లి ప్యాసింజర్ రైలులో 167 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరగకుండా వీరిని కాపాడిన గ్యాంగ్మన్ రమేష్ను డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్, ప్రయాణికులు అభినందించారు.

# ప్రతి కుటుంబంలో ముగ్గురు పిల్లలు ఉండాలి

ఇంటర్నెట్ డెస్క్

సంతానోత్పత్తి రేటు తక్కువగా ఉన్న సమాజాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని, అందుకే ప్రతి భారతీయ కుటుంబం ముగ్గురు పిల్లలు ఉండేలా చూసుకోవాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. జనాభా స్థిరీకరణతోపాటు క్షీణతను నిరోధించడానికి ఇది దోహదపడుతుందన్నారు. ఆరెస్సెస్ వందేళ్లు పూర్తిచేసుకున్న నేపథ్యంలో ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన మత మార్పిడిలు, చొరబాట్లు, హిందూ–ముస్లిం ఐక్యత, పలు రాష్ట్రాల్లో భాషా వివాదాలు వంటి అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా భాజపాతో ఎటువంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.

**ముగ్గురు పిల్లలు..**

"సరైన వయసులో వివాహం చేసుకోవడం, ముగ్గురు పిల్లల్ని కనడం అనేది తల్లిదండ్రులకు, పిల్లలకూ ఆరోగ్యకరం. జనాభా పెరుగుదల ఓ వరమైనప్పటికీ.. కొంత భారమే. అందరికీ ఆహారం సహా అన్ని వసతులు అందించాలి. జనాభా నియంత్రణ విధానం




ఉన్నది అందుకే. ముగ్గురికంటే ఎక్కువ పిల్లలు ఉండకుండా జాగ్రత్త పడాలి. తద్వారా పెంపకంలో ఇబ్బందులు రావు. ఈ వాస్తవాన్ని అంగీకరిస్తూ ముగ్గురు పిల్లలు ఉండేలా కొత్త తరాలు చూసుకోవాలి" అని భాగవత్ పేర్కొన్నారు.

**మహిళలకు సురక్షితమైన నగరాల్లో విశాఖ**

**మత మార్పిడిలు ఆందోళనకరం..**

జనాభా సమతుల్యత సమస్యను ప్రతి దేశం ఎదుర్కొంటోందని మోహన్ భాగవత్ పేర్కొన్నారు. ఈ క్రమంలో మతమార్పిడిలు ఆందోళన కలిగిస్తున్నాయన్న ఆయన.. కొన్ని వర్గాల వారు కూడా ఇది మంచిది కాదని చెబుతున్నారన్నారు. చొరబాట్ల గురించి మాట్లాడుతూ.. డీఎన్ఏ ఒకటే అయితే అనుమతి తీసుకొని దేశంలోకి రావచ్చన్నారు. అక్రమంగా వస్తేనే సమస్యలు వస్తాయని చెప్పారు. చొరబాట్లను ప్రభుత్వాలు కొంతవరకే అడ్డుకోగలవని, వీరికి ఉపాధి కల్పించకుండా సామాన్యులు కూడా ప్రభుత్వాలకు సాయం చేయొచ్చన్నారు.

**భాజపాతో విభేదాల్లేవ్..**

భాజపా కోసం ఆరెస్సెస్ నిర్ణయాలు తీసుకుంటుందనేది వాస్తవం కాదని మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. భాజపా విధానపరమైన నిర్ణయాల్లో ఎటువంటి జోక్యం ఉండదని స్పష్టం చేశారు. తాను పదవీ విరమణ చేస్తానని ఎన్నడూ చెప్పలేదని, ఎవరినీ 75ఏళ్లకే రిటైర్ కావాలనీ చెప్పలేదన్నారు. తాను జీవితంలో ఎప్పుడైనా రిటైర్ కావచ్చని, సంఘ్ కోరుకున్నంత కాలం పని చేసేందుకు సిద్ధమేనన్నారు.

# జిన్‌పింగ్..ముర్ము..మోదీ !

## రహస్య లేఖతో మెరుగుపడ్డ భారత్ - చైనా సంబంధాలు

న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల కొరడా ఝళిపిస్తున్న వేళ ఓ లేఖ భారత్–చైనాల సంబంధాలను మలుపుతిప్పింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఓ లేఖ రాశారు. భారత్‌తో సంబంధాలను మెరుగుపర్చుకోవాలనే ఆకాంక్షను ఆయన అందులో వ్యక్తం చేశారు. లేఖను రాష్ట్రపతి ముర్ము ప్రధాని మోదీకి అందజేశారు. భారత్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి తమకు ఈ విషయం తెలిపినట్లు బ్లూమ్‌బర్గ్ తాజా కథనంలో పేర్కొంది. అమెరికాతో కుదుర్చుకున్న ఎలాంటి ఒప్పందమైనా అది అంతిమంగా చైనా ప్రయోజనాలకు హానికల్గిస్తుందని జిన్‌పింగ్ ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేసినట్లు వెల్లడించింది. ద్రౌపదీ ముర్ముకు మార్చిలో జిన్‌పింగ్ ఒక లేఖ రాసినట్లు రెండు దేశాల మీడియాల్లోనూ వచ్చింది. అయితే, ఆ లేఖ ఇదేనా అనే విషయం స్పష్టం కాలేదు. అనంతర పరిణామాల్లో రెండు దేశాలు తమ మధ్య సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు పలు చర్యలను ప్రకటించాయి. కైలాస్%–%మానస సరోవర్ యాత్ర మార్గాన్ని భారత తీర్థయాత్రికుల కోసం చైనా తెరవగా చైనా పర్యాటకుల కోసం భారత్ వీసాల జారీని ప్రారంభించింది. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సేవలు సైతం మొదలయ్యాయి. మార్చిలో జిన్‌పింగ్ రాసిన లేఖ తర్వాత, ట్రంప్ టారిఫ్‌ల బాదుడు మొదలుకాక మునుపే భారత్, చైనాల మధ్య దౌత్యపరమైన చర్చలు, సంప్రదింపులు మొదలైనట్లు బ్లూమ్‌బర్గ్ కథనం విశ్లేషించింది. మరోవైపు, ట్రంప్ టారిఫ్‌ల విధానం అమెరికా%–%భారత్ మధ్య అంతరాన్ని పెంచింది. దీనికితోడు భారత్, పాకిస్తాన్‌ల



మధ్య జరగాల్సిన అణుయుద్ధం తన జోక్యంతోనే ఆగిందంటూ ట్రంప్ పదేపదే చెప్పుకోవడాన్ని భారత్‌కు అస్సలు రుచించలేదు. అప్పటి వరకు చైనాకు దగ్గరయ్యే విషయాన్ని అంత సీరియస్‌గా ఆలోచించని భారత్ జూన్ తర్వాతే చైనాతో సంబంధాల మెరుగుపై దృష్టిపెట్టిందని బ్లూమ్‌బర్గ్ కథనం విశ్లేషించింది. గతేడాది లద్దాఖ్‌లోని ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి సైన్యాలను పాక్షికంగా ఉపసంహరించుకోవాలని రెండు దేశాలు అంగీకారానికి రావడం కూడా చైనాపై సానుకూలంగా ఆలోచించేందుకు దారి చూపిందని తెలిపింది. ఇదే త్వరలో చైనాలో జరిగే ఎస్‌సీవో శిఖరాగ్రం సందర్భంగా జిన్‌పింగ్, మోదీల ముఖాముఖీకి మార్గ సుగమం చేసిందని విశ్లేషకులు చెబుతున్నారు. భారత్ కంటే ముందుగా చైనాపైనే ట్రంప్ 145 శాతం టారిఫ్‌లను ప్రకటించారు. అయితే, ఆ దేశంతో అమెరికా వైఖరి మరోలా ఉంది. టారిఫ్‌లకు తాత్కాలిక విరామం ప్రకటించిన అమెరికా ప్రస్తుతం ఆ దేశంతో వాణిజ్య చర్చలు జరుపుతోంది. కీలక ఖనిజాల సరఫరా వంటివి చైనా చేతుల్లో ఉండటంతో ట్రంప్ ఆ దేశంతో జాగ్రత్తగా డీల్ చేస్తున్నారు.

# ట్రంప్ సుంకాలపై కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలతో.. ఇప్పటి వరకూ ఆ దేశానికి భారత్ నుంచి వెళ్తున్న దాదాపు 4,820 కోట్ల డాలర్ల (రూ.4,22,384 కోట్ల) విలువైన ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. సుంకాల వల్ల అమెరికా మార్కెట్లలో భారతీయ సరుకుల ధరలు భారీగా పెరిగిపోవటంతో.. ఇతర దేశాల (సుంకం పోటు తక్కువగా ఉన్న దేశాల) సరుకులతో పోటీ పడలేని పరిస్థితి. మరి, ఇంత భారీ నష్టాన్ని భర్తీ చేసుకునేదెలా? ప్రస్తుతం కేంద్ర సర్కారు దీనిపైనే తీవ్రంగా కసరత్తు జరుపుతోంది. ఇందులో భాగంగా, ఇక మీదట అమెరికాయేతర దేశాల మార్కెట్లపై ఎక్కువగా దృష్టి సారించాలని నిర్ణయించింది. వీటిలో బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, నెదర్లాండ్స్, పోలండ్, కెనడా, మెక్సికో, రష్యా, బెల్జియం, టర్కీ, యూఏఈ, ఆస్ట్రేలియా తదితర 40 దేశాలున్నాయి. ఈ దేశాల్లో ఇతర సరుకులతోపాటు వస్త్ర పరిశ్రమ ఎగుమతులకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది (అమెరికా సుంకాలతో తీవ్రంగా నష్టపోతున్నది వస్త్ర పరిశ్రమనే). దీనిపై ఓ అధికారి మాట్లాడుతూ, 'ప్రతీ దేశంలోనూ లక్ష్మిత వ్యూహంతో ముందుకెళ్లాలని అనుకుంటున్నాం. నాణ్యమైన, వినూత్నమైన ఉత్పత్తులను ఎగుమతి చేయటమేకాదు.. ఆయాదేశాలు ఆధారపడతగిన, విశ్వసించదగిన సరఫరాదారుగా పేరు తెచ్చుకునేలా కృషి చేస్తాం. ఈ కార్యాచరణలో ఆయాదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలతోపాటు 'ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు' కూడా కీలకపాత్ర పోషించనున్నాయి' అని వెల్లడించారు.




**220 దేశాలకు ఎగుమతులు**

భారత్ ప్రపంచవ్యాప్తంగా 220కిపైగా దేశాలకు ఎగుమతులు చేస్తోంది. వీటిలో బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియాలతో కూడిన 40 దేశాలు అత్యంత కీలకమైనవి. ఈ దేశాలు ఏటా 59,000 కోట్ల డాలర్ల (రూ.51,70,000 కోట్లు) విలువైన జౌళి ఉత్పత్తులు, వస్త్రాలను దిగుమతి చేసుకుంటున్నాయి. ఇంతటి భారీ మార్కెట్లో మనదేశం వాటా 5–6% మాత్రమే. అంటే, ఈ దేశాల్లో మన మార్కెట్ వాటాను పెంచుకోవటానికి పుష్కలమైన అవకాశాలున్నాయి. దీనివల్లే ట్రంప్ సుంకాల నేపథ్యంలో.. వీటిపై కేంద్రం దృష్టి పెట్టింది. ఈ కార్యాచరణలో కీలకంగా భావిస్తు న్న ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు.. ఆయా దేశాల్లో మార్కెట్ మ్యాపింగ్, అధిక డిమాండ్ ఉన్న ఉత్పత్తుల గుర్తింపు మీద నిశితమైన అధ్యయనం జరిపి మార్గదర్శకాలను వెలువరిస్తాయి. అంతర్జాతీయ ట్రేడ్‌ఫెయిర్లలో, ఎగ్జిబిషన్లలో, కొనుగోలు–అమ్మకందారు సమావేశాల్లో భారత్ బ్రాండ్‌ను బలంగా ముందుకు తీసుకెళ్తాయి. భారత ఎగుమతిదారులు అంతర్జాతీయ ప్రమాణాలను పాటించేలా చేయటం, ఆయాదేశాల మార్కెట్లలోకి వెళ్లటానికి అవసరమైన పత్రాలను సంపాదించుకోవటంలో దిశానిర్దేశం చేస్తాయి. మరోవైపు, భారతీయ ఎగుమతిదారులను రక్షించటానికి రూ.25 వేల కోట్లతో 'ఎగుమతి ప్రోత్సాహక మిషన్'ను ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. కాగా, ట్రంప్ సుంకాలతో వస్త్రాలు, ముత్యాలు, ఆభరణాలు, రొయ్యలు, లెదర్ పరిశ్రమలపై ముఖ్యంగా.. ఎక్కువ మంది కార్మికులు పని చేసే రంగాలపై తీవ్రంగా ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో, ఆయా రంగాలకు చెందిన ఎగుమతిదారులతో ఈ వారంలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ సమావేశం కానుంది. ప్రత్యామ్నాయాల అన్వేషణ, అమెరికాయేతర మార్కెట్లకు ప్రాధాన్యం, కొత్త మార్కెట్లలోకి వెళ్లటం తదితర అంశాలను సమగ్రంగా చర్చించనున్నట్లు సమాచారం. ప్రస్తుతానికైతే, అమెరికా సుంకాలకు పోటీగా ఆ దేశంపై ప్రతీకార సుంకాలు విధించే యోచన ఏమీ లేదని అధికారవర్గాలు తెలిపాయి.

**స్టాక్‌మార్కెట్ల పతనం**

అమెరికా 50% సుంకాల ప్రభావం తీవ్రంగానే ఉంటోంది. మంగళ, గురువారాల్లో స్టాక్‌మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా, మదుపరులు రూ.9.6 లక్షల కోట్ల మేర నష్టపోయినట్లు మార్కెట్ నిపుణులు అంచనా వేశారు.


## ఎన్డీయేకు 324.. 'ఇండియా'కు 208

న్యూఢిల్లీ

దేశంలో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు 324 సీట్లు లభిస్తాయని ఇండియా టుడే–సీ వోటర్ 'మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే'లో తేలింది. విపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమికి కేవలం 208 స్థానాలు దక్కే అవకాశం ఉందని సర్వే వెల్లడించింది. ఈ ఏడాది జూలై 1 నుంచి ఆగస్టు 14 దాకా ఈ సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా.. దేశవ్యాప్తంగా వివిధ లోక్‌సభ నియోజకవర్గాల్లో 54,788 మందిని ప్రశ్నించారు. సీవోటర్ రెగ్యులర్ ట్రాకర్ డేటా ద్వారా మరో 1,52,038 మంది అభిప్రాయాలు సేకరించారు. మొత్తం 2,06,826 మంది వ్యక్తి చేసిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. తాజాగా సర్వే నివేదిక విడుదల చేశారు. దేశంలో ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయే మళ్లీ ఘన విజయం సాధించడం తథ్యమని సర్వే తేల్చింది. పార్టీల పరంగా చూస్తే బీజేపీకి సొంతంగా 260 సీట్లు, కాంగ్రెస్‌కు సొంతంగా 97 సీట్లు వస్తాయని వెల్లడయ్యింది. 2024 ఎన్నికల్లో ఎన్డీయేకు 44 శాతం ఓట్లు లభించగా, ఇప్పుడు 46.7 శాతం ఓట్లు లభిస్తాయని సర్వే పేర్కొంది.

2024 లోక్‌సభ ఎన్నికల్లో 543 స్థానాలకు గాను బీజేపీ కేవల 240 స్థానాలు గెలుచుకుంది. మెజార్టీకి 32 సీట్లు తక్కువొచ్చాయి. దాంతో మిత్రపక్షాల సాయంతో కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మొత్తంగా ఎన్డీయేకు ఇప్పుడు 293 సీట్లున్నాయి. ఇక విపక్ష ఇండియా కూటమి గత ఎన్నికల్లో 234 సీట్లు సాధించింది.

## 31న జిన్‌పింగ్‌తో మోదీ భేటీ



న్యూఢిల్లీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 31, వచ్చే నెల 1వ తేదీల్లో చైనాలో పర్యటించబోతున్నారు. తియాంజిన్ నగరంలో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా ఈ నెల 31వ తేదీన చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో మోదీ సమావేశమవుతారు. ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. భారత్–చైనా సంబంధాలు, పరస్పర సహకారంతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై వారు చర్చించే అవకాశం ఉంది. అలాగే వచ్చే నెల 1వ తేదీన రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో నరేంద్ర మోదీ భేటీ అవుతారు. భారత్–అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు ఒత్తిడికి లోనవుతున్న నేపథ్యంలో చైనా, రష్యా అధినేతలతో భారత ప్రధానమంత్రి ప్రత్యేకంగా సమావేశం కాబోతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాన్ని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. రష్యా నుంచి ముడి చమురు కొంటున్నందుకు భారత ఉత్పత్తులపై ట్రంప్ ప్రభుత్వం ఏకంగా 50 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. మరోవైపు భారత్–చైనా మధ్య సంబంధాలు క్రమంగా బలపడుతున్నాయి. భారత్‌పై అమెరికా విధించిన భారీ టారిఫ్‌లను జిన్‌పింగ్ తప్పుపట్టారు. ప్రధాని మోదీ చైనాలో పర్యటిస్తుండడం ఏడేళ్ల తర్వాత ఇదే మొదటిసారి కావడం విశేషం. ఆయన చివరిసారిగా 2018లో చైనాలో పర్యటించారు. వూహాన్ సిటీలో షీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా, మోదీ–పుతిన్ మధ్య జరగబోయే ద్వైపాక్షిక భేటీకి విశేషమైన ప్రాధాన్యం ఉంది. ఇటీవలి కాలంలో ఇండియాకు మరింత దగ్గరయ్యేందుకు పుతిన్ ప్రయత్నిస్తున్నారు. ఉక్రెయిన్‌పై దండయాత్ర ప్రారంభించిన తర్వాత రష్యాపై పశ్చిమ దేశాలు కఠిన ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే భారత్, చైనాల నుంచి మరింత సహకారాన్ని పుతిన్ కోరుకుంటున్నారు. తియాంజిన్‌లో మోదీ, జిన్‌పింగ్, పుతిన్ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు రష్యా ప్రభుత్వం ఇటీవల సంకేతాలిచ్చింది.

## గవర్నర్లు జడ్జిలు కాదు

న్యూఢిల్లీ

శాసనసభ ఆమోదించిన బిల్లు రాజ్యాంగబద్ధమా, కేంద్ర ప్రభుత్వ చట్టానికి విరుద్ధమా? అని చూడాల్సిన బాధ్యత గవర్నర్‌కులేదని తమిళనాడు ప్రభుత్వం వాదించింది. గవర్నర్ రాజ్యాంగ ప్రతినిధి మాత్రమేనని, ఆయన సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తికాదని స్పష్టం చేసింది. ఆ అధికారాలు న్యాయస్థానాలకు మాత్రమే పరిమితమని గుర్తు చేసింది. శాసనసభ పంపిన బిల్లును గవర్నర్ ఆపితే తిరిగి శాసనసభకు పంపాలని, నిర్ణయం తీసుకోకుండా తన దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. శాసనసభ ఆమోదించిన ద్రవ్య బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ నిలిపివేస్తే ఆయన సూపర్ చీఫ్ మినిస్టర్‌గా వ్యవహరిస్తున్నారని భావించవచ్చునని గురువారం సుప్రీంకోర్టు ముందు వాదనల్లో పేర్కొంది. రాజ్యాంగంలోని 143 అధికరణ కింద రాష్ట్రపతి, గవర్నర్ అధికారాలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీం ముందు లేవనెత్తిన ప్రశ్నలపై రాజ్యాంగ ధర్మాసనం ముందు జరుగుతున్న విచారణలో భాగంగా తమిళనాడు తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. ద్రవ్య బిల్లులను కూడా గవర్నర్ నిరాకరించవచ్చునని మహారాష్ట్ర ప్రభుత్వం తరపున హరీష్ సాల్వే, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వ్యాఖ్యలకు సింఘ్వి సమాధానమిచ్చారు. బిల్లులపై తుది నిర్ణయం ఎన్నికైన ప్రజా ప్రభుత్వానిదికాకుండా గవర్నర్‌దేనని రాజ్యాంగంలో ఎక్కడపేర్కొన్నారో చూపాలని అడిగారు. తెలంగాణ, ఏపీ, తమిళనాడులో చాలాకాలం నిలిపివేసిన పలు ఉదంతాలను ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గవర్నర్ అధికారాలకు సంబంధించిన 207 అధికరణలో చెప్పిన అంశా లు ప్రైవేటు సభ్యుల మనీ బిల్లులకే వర్తిస్తుందని, వాటిని నివారించేందుకే ఈ అధికరణను చేర్చారని ఆయన తెలిపారు. ఇతర అన్ని రకాల బిల్లుల విషయం లో గవర్నర్ మంత్రివర్గ ఆమోదంమేరకే నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. గవర్నర్, రాష్ట్రపతి లాంఛనప్రాయ రాజ్యాంగ అధినేతలని, కొన్ని సందర్భాల్లో తప్ప ప్రభుత్వ నిర్ణయాల్లో జోక్యం చేసుకునే అధికారం వారికి లేదన్నారు. 200 అధికరణ ప్రకారం.. గవర్నర్ తొలుత ఆమోదాన్ని నిలిపివేసినప్పుడు శాసనసభకు మాత్రమే తిరిగి పంపాలని తెలిపారు. శాశ్వతంగా ఏ బిల్లు నూ నిలిపివేసే అధికారం గవర్నర్‌కులేదన్నారు. విచారణ క్రమంలో ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ గవాయి వ్యాఖ్యానిస్తూ..సాధ్యమైనంత త్వరలో అంటేనే వేగంగా నిర్ణయం తీసుకోవాలనే రాజ్యాంగ లక్ష్యాన్ని అది స్పష్టీకరిస్తోందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య ఏర్పడిన వివాదం కేసులోనూ ఉన్నత న్యాయస్థానం ఈ విషయాన్ని స్పష్టీకరించిందని గుర్తు చేశారు. నిరవధికంగా బిల్లును ఆమోదించకుండా నిలిపివేసే హక్కు గవర్నర్‌కు లేదన్నారు.

## కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయం విద్యార్థుల బోర్ వాటర్ సమస్యను కస్తూర్బా గాంధీ ప్రాజెక్ట్ ఏఈ శివాజీ ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువెళ్లిన వెను వెంటనే పరిష్కరించిన గౌరవ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు

??జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్రిగూడ నందు కూడా బోర్ వేయించి విద్యార్థుల సమస్యను పరిష్కరించిన గౌరవ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు

గత నెల యరగ డ్లపల్లి పల్లి గ్రామంలో మార్నింగ్ వాక్ లో భాగంగా హై స్కూల్ పక్కన బొడ్రాయి బజార్లో కాలనీ ప్రజల యొక్క సమస్యను నీటి ఎత్తడిని ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరించిన గౌరవ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**ప్రభాత సూర్య మర్రిగూడ ఆగస్టు 28** ఈ రోజు మర్రిగూడ మండలం మర్రిగూడ టౌన్ లో కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో విద్యార్థులు నీటి సమస్యను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చిన కస్తూర్బా గాంధీ ప్రాజెక్టు శివాజీ సమస్యను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే గౌరవ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి స్పందించి వెంటనే బోర్ పాయింట్ వేయించి కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ విద్యార్థుల యొక్క సమస్యను వెంటనే పరిష్కరించడం జరిగింది అదేవిధంగా మర్రిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అధ్యాధునిక సదుపాయాలతో నూతన బిల్డింగ్ ప్రారంభం చేయడానికి, విద్యార్థిని,విద్యార్థులకు టాయిలెట్స్ నందు నీరు సరిపోకపోవడం వలన ఇబ్బందులకు గురవుతున్న విషయం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి దృష్టికి వచ్చిన వెంటనే బోర్ వేయించి విద్యార్థులకు సమస్యను వెను వెంటనే పరిష్కరించడం జరిగింది...అదేవిధంగా ఈరోజు మర్రిగూడ మండలంలో యరగ డ్లపల్లి గ్రామంలో గత నెల మార్నింగ్ వాక్ లో భాగంగా మా గ్రామంలో నీటి సమస్య ఉన్నది ఒక బోర్ వేయించండి సార్ అని కాలనీ ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే నెల రోజుల్లోనే ఈ రోజు ఉదయం బోర్ వేయించి సమస్యను పరిష్కరించడం జరిగింది....యరగ డ్లపల్లి గ్రామ ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేయడం జరిగింది...గౌరవ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సార్ గారికి గ్రామ మరియు మండల ప్రజలు ధన్యవాదములు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్, కస్తూర్బా గాంధీ ప్రాజెక్ట్ ఏఈ శివాజి యాదవ్, గారు కొబ్బరికాయ కొట్టి బోర్ పాయింట్ వేయించడం జరిగింది...ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కాకుళవారం అశోక్ రెడ్డి,మాల్ మార్కెట్ డైరెక్టర్ జమ్ముల వెంకటేష్,మాజీ సర్పంచ్ మాడెం వెంకటయ్య,వెంకట పేట బాలయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొడాల అల్వాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యరగాండ్లపల్లి యువ నాయకులు పులిమామిడి





నర్సి రెడ్డి, ఎడుదొడ్ల కృష్ణా రెడ్డి, ఎలిమినేటి సత్తిరెడ్డి,సిలువేరు యాదయ్య, గ్యార వెంకటేష్,కురంపల్లి నర్సింహ,వల్లంల మణి,నక్కరగోని కొండల్,ఆకారపు శ్రీను,పల్లెటీ యాదయ్య, అందుగుల అంజయ్య,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు....

# మళ్లీ తెరపైకి ఇచ్చంపల్లి

**కరీంనగర్ :** కాళేశ్వరం వల్ల తెలంగాణకు లాభం లేదని.. దానివల్ల విపరీతమైన ఖర్చు అవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నది. ఇందులో భాగంగానే ఖర్చు లేకుండానే.. తెలంగాణలో మెజారిటీ పంట పొలాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలోనే నిజాం కాలం నాటి ప్రాజెక్టును తెరపైకి తీసుకువచ్చింది. ఇంతకీ ఆ ప్రాజెక్టు ఏమిటి? నిజాం కాలంలోనే ఫ్రెంచ్ దేశాలు చెందిన ఇంజనీర్లు ఇచ్చంపల్లి ప్రాజెక్టును మొదలుపెట్టారు.. ఆ తర్వాత ఈ ఆగిపోయింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం గురించి చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. నిజాం కాలంలో ఇచ్చంపల్లి ప్రాంతం వద్ద నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టును పూర్తి చేయాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు ఈ ప్రాజెక్టు పూర్తి చేసి గోదావరి జలాలను బీడు భూములకు మళ్ళించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.ఫ్రెంచ్ దేశానికి చెందిన 30 మంది ఇంజనీర్లు.. వేలాది మంది కూలీలు ఇచ్చంపల్లి ప్రాజెక్టు పనుల్లో అప్పట్లో తలమునకలయ్యారు. ఒకవేళ ఆ ప్రాజెక్టు గనుక అప్పట్లో పూర్తయి ఉంటే హైదరాబాద్ నగరానికి నిత్యం తాగునీరు అందేది. అంతేకాదు లక్షల ఎకరాలకు సాగునీరు కూడా అందేది. అయితే అనుకోకుండా ఏర్పడిన అవాంతరాల వల్ల ఈ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. అంతు చిక్కని వ్యాధి సోకి ఇంజనీర్లు, కూలీలు చనిపోయారు. ఇక ఆ తర్వాత ఆ ప్రాజెక్టు పనులు మొదలు కాలేదు. అయితే ఇప్పటికి నాటి కట్టడాలు కనిపిస్తూనే ఉన్నాయి.. ముఖ్యంగా చత్తీస్ గడ్ వైపు నిర్మించిన బండ్ అత్యంత బలంగా కనిపిస్తోంది.నదులను అనుసంధానం చేయాలని ఇటీవల కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఇక్కడి జీవ నదులను అనుసంధానం చేయాలని భావిస్తున్నారు.. ఇందులో భాగంగానే ఇటీవల ఇంజనీర్లు సమగ్రంగా పరిశీలన చేపట్టారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టుతో పాటు ములుగు జిల్లా మంగపేట మండలం రాంపురం, కన్నాయిగూడెం మండలం కంతనపల్లి వద్ద గోదావరి పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. అయితే నాడు ఫ్రెంచ్ ఇంజనీర్లు డిజైన్ చేసిన ఎత్తిపోతల పథకం నేటికీ అనుకూలంగానే ఉందనే భావన సాగునీటి రంగ



వ్యక్తమవుతోంది. అయితే నాటి కట్టడాలను పునరుద్ధరించి.. ఇప్పటి కాలానికి అనుగుణంగా ఆధునికరించి గోదావరి జలాలను బీడు భూములకు మళ్ళించాలనేది రేవంత్ ప్రభుత్వం ప్రతిపాదనగా ఉన్నట్టు తెలుస్తోంది.మరోవైపు గోదావరి నది మీద నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత నది నీళ్లు మాత్రమే ఆధారం. ప్రాణహిత ప్రవాహం వల్ల మేడిగడ్డ ప్రాంతంలో 2,843 ఎఒఅ ల మీరు అందుబాటులో ఉంటుంది. ప్రాణహిత తరహాలోనే ఎంత చెప్పండి ప్రాంతం ఎగువన 108 మీటర్ల దూరంలో ఇంద్రావతి నది గోదావరిలో కలుస్తుంది. పూర్తిగా అడవి ప్రాంతం నుంచి వస్తున్న ఇంద్రావతి నది ప్రవాహం వృధాగా సముద్రంలో కలుస్తోందని నిపుణులు చెబుతున్నారు. ప్రాణహితతో పాటు ఇంద్రావతి నది ప్రవాహాన్ని కూడా పూర్తిస్థాయిలో వాడుకుంటే తెలంగాణలో కరువు అనేది ఉండదని అధికారులు చెబుతున్నారు. ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టు నిర్మించి.. ఆ నీటిని నాగార్జునసాగర్ వైపు తరలిస్తే మరింత ఉపయుప్తంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ఇచ్చంపల్లి వద్ద 600 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని సాగునీటి రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కృష్ణా నది పరివాహకంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదు.. గోదావరి పరివాహక ప్రాంతంలో మాత్రం వర్షాలు మెండుగా ఉంటున్నాయి. అందువల్లే ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మించి.. తద్వారా ఆ నీటిని కృష్ణా నదికి మళ్లిస్తే నీటి కొరతను తగ్గించవచ్చనేది సాగునీటి రంగ నిపుణుల అభిప్రాయం.. ఇంద్రావతి నదికి 116 మీటర్ల దూరంలో ఉన్న భూపాలపల్లి జిల్లా పలిమెల ఆరంపల్లి వద్ద అప్పట్లో ఫ్రెంచ్ ఇంజనీర్లు గోదావరి నదిపై ఆనకట్టను నిర్మించారు.

# భారీ వర్షాలు దృష్ట ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

**వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.గురువారం జిల్లా కేంద్రంతో పాటు అనసీతారం వద్ద గల వాగును, ధర్మపురి గోదావరి ప్రాంతాన్ని,రాయపట్నం బ్రిడ్జిని సందర్శించారు. ఈ సందర్భంగా నది వద్ద ప్రస్తుత నీటి మట్టం, ప్రవాహం వేగం, సేఫ్టీ బారికేడ్లు, రక్షణ చర్యలను పరిశీలించారు. భారీ వర్షాల వల్ల ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుండి నీటి ప్రవాహం కొనసాగుతున్న దృష్ట నీటి ప్రవాహం ఉధృతంగా ఉంటుంది కావున నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నీటి ప్రవాహని అంచనా వేయకుండా స్నానాలు చేయడానికి నది లోపలికి వెళ్లే ప్రయత్నం చేయవద్దన్నారు. వరద నీటి ఉధృతిని అంచనా



వేయకుండా నదులు,కాలువలు,కుంటలు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు.విద్యుత్ స్తంభాల సమీపంలోకి వెళ్లవద్దని సూచించారు.అత్యవసర పరిస్థితిలో తప్ప బయటకు రాకూడదని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిం చారు. పోలీస్,రెవెన్యూ,మున్సిపల్, అధికారులు, సిబ్బంది ఎల్ల ప్పుడూ అలర్ట్ గా ఉండాలని, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా చైతన్య పర్చాలని ఎస్పీ సూచించారుఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్,ధర్మపురి సి.ఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్.ఐ ఉదయ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## రేవంత్‌ను ఆడేసుకుంటున్న బీఆర్ఎస్

**హైదరాబాద్ :** బీహార్ రాష్ట్రంలో త్వరలో శాసనసభకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో గెలవడం ఇండియా కూటమికి అత్యంత ఆవశ్యకంగా మారింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారింది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో ఆ పార్టీ విజయం సాధిస్తామనే ధీమా లో ఉండేది. కానీ ఆ పార్టీ ఊహించిన ఫలితం రాకుండా పోయింది. దీంతో అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ బిజెపిని లక్ష్యంగా చేసుకొని విమర్శలను మొదలు పెట్టింది. ఓటు చోరీ అనే అస్త్రాన్ని ప్రయోగించింది. రాహుల్ గాంధీ అయితే ఏకంగా బీహార్ లో ప్రధానమంత్రిని లక్ష్యంగా చేసుకొని వినూత్నంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈ ర్యాలీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ముందు వరుసలో ఉంటున్నారు. రాహుల్ గాంధీ అయితే ఏకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఉద్దేశించి ఓట్ల చోరీకి పాల్పడ్డ వ్యక్తి అంటూ విమర్శిస్తున్నారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ పిలుపుమేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ వెళ్లారు. రాహుల్ గాంధీ చేపడుతున్న ఓటు అధికారి ర్యాలీలో రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో తాము చేపట్టిన కుల గణన గురించి.. మహిళలకు ఉచితంగా కల్పిస్తున్న ఫ్రీ బస్సు గురించి.. అన్నదాతలకు చేసిన రుణాల మాఫీ గురించి రేవంత్ వివరించారు.. బీహార్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని రేవంత్ వివరించారు. రేవంత్ కు హిందీ మీద పట్టు ఎక్కువ కాబట్టి బీహార్ ప్రజలకు అర్థమయ్యే విధంగా మాట్లాడారు.. రాహుల్, ప్రియాంక తో కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.. ఇది సహజంగానే తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు ఉత్సాహాన్ని కలిగించింది. కొంతకాలంగా రేవంత్ ను రాహుల్ దూరం పెడుతున్నారనే విమర్శలకు సరైన సమాధానం లభించినట్లయిందని కాంగ్రెస్ శ్రేణులు భావించాయి. వారి ఆనందాన్ని దూరం చేశారు జన్ సూరజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్.ప్రశాంత్ కిషోర్ బీహార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఆయన గతంలో ఎన్నికల వ్యూహకర్తగా ఉండేవాడు. ఆ తర్వాత రాజకీయ నాయకుడిగా మారిపోయారు. ఒక పార్టీని కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుత బీహార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేసిన

మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్



**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 28(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన చెరుకుపల్లి మల్లయ్య కొద్దిరోజుల క్రితం మరణించగా నిరుపేద కుటుంబం కావడంతో గురువారం ఆయన దశదిన కర్మ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సహకారంతో గ్రామ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మృతుని కుటుంబానికి క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ బిక్షం,నాయకులు పాశం కృష్ణ,రాసాల వెంకటేష్,గుండమల్ల సతీష్, ,చిలువేరు శంకర్,శికిలమెట్ల ప్రభాకర్,పెరా రమేష్,వడ్డెపల్లి రాములు,జనగాం నర్సింహ్మ,మందుగుల సాయికిరణ్, బి జె ఆర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యావాలంటరికి లయన్స్ క్లబ్ చేయూత.....




**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** గంగారాం ప్రభుత్వ పాఠశాలలో విద్యావాలంటరిగా విధులు నిర్వహిస్తున్న సీతా రాధిక లయన్స్ క్లబ్ ఆఫ్ హైద్రాబాద్ 2 నెలల జీతం రూ 24 వేల రూపాయలను అందచేయడం జరిగింది. విద్యావాలంటరలీకు ప్రతి నెల స్వచ్ఛంగా సంస్థలు ముందుకు వచ్చి జీతాలు అందజేయడం జరుగుతుందని ఈ మేరకు లయన్స్ క్లబ్ ముందుకు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్ సంతోషం వ్యక్తం చేశారు. విద్యావాలంటరికీ చేయూత అందించడం కోసం మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని లయన్స్ క్లబ్ హోప్ ప్రధాన కార్యదర్శి కొండ విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జోన్ చైర్మెన్ బసిరెడ్డి మధూసుధన్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ బర్కా మల్లేశ్ యాదవ్ , మారం ప్రసాద్ , బస్వరాజు , పాఠశాల అమ్మ అదర్శ పాఠశాల చైర్మెన్ భీమమ్మ, ఉపాద్యాయ కమిటి నరహరి తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండలో ప్రారంభమైన గణేష్ నిమజ్జనం

**నల్గొండ ఆగస్టు 28 ప్రభాత సూర్య** నల్గొండ జిల్లా కేంద్రంలోని గణేష్ నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకొని ఉండ్రాలు, కురుములు, నైవేద్యాలు, సమర్పించి భక్తి, శ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాధుని గురువారం పానగలు ఉదయసముద్రంలో నిమజ్జనం చేసి మాట్లాడారు పిల్లాపాపలను, పాడి, పంటలతో ఆయురారోగ్యాలతోసుఖ, సంతోషాలతో మీ చల్లని చూపులు మాపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంచాల సబిత, మంచాల కెన్సీ, మంచాల హిమాన్షు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .





## చైతన్యపురి కాలనీలో గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు



**నల్గొండ ఆగస్టు 28** ప్రభాత సూర్య నల్లగొండ పట్టణం దేవరకొండ రోడ్ 10వ వార్డు, చైతన్యపురి కాలనీలో గణేష్ విగ్రహం వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో 2 వ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనపాల గణేష్ స్రవంతి దంపతులు, శ్రీహరి, సురేందర్ రెడ్డి, శశి కుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి ,మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గల్లీ కా గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పూజాలు...

**మాదాపూర్ ప్రభాత సూర్య :** మాదాపూర్ డివిజన్ పరిదిలో లో నీ గుట్టల బేగంపేట్ లో నీ గల్లీ కా గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గల్లీ కా గణేష్ యూత్ అసోసియేషన్ ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓరిగంటి యాదయ్య, ఓరిగంటి రాజశేఖర్ , పొన్నాల అరుణ్ కుమార్ , శివ యాదవ్, ఓరిగంటి యశ్వంత్, ఓరుగంటి పవన్, సిదిరామ్ రాసా, షణ్ముఖ్ రాజా, గణేష్, కార్తీక్ తదితరాలు పాల్గొన్నారు.



# పడకేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలనపై బీజేపీ నిరసన



**గట్టుప్పల్, ప్రభాతసూర్య ఆగస్టు 28:** గట్టుప్పల మండలం అంతంపేట గ్రామంలో రోడ్ల దుస్థితిపై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రధాన రహదారిపై వరి నాట్లు వేసి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. అంతంపేట రహదారులు వర్షాల కారణంగా గుంతల మయంగా మారి, నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నేతలు విమర్శించారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల మురుగు నీరు నిలిచిపోగా, దోమల బెడద అధికమై సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అంతంపేట గట్టుప్పల రహదారి, అంతంపేట శివన్నగూడం రహదారులను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రావుల యల్లప్ప, చిలివేరు దుర్గయ్య, మండల ఉపాధ్యక్షులు జంపాల సుధాకర్, కంపే దుర్గయ్య, ప్రధాన కార్యదర్శులు ఇడం రాజు, నాగులగాని శ్రీనివాసులు, కిసాన్ మోర్చా అధ్యక్షులు వీరమల్ల రాజు, పగిళ్ళ బిక్షం, మధగని బిక్షం, మదగాని రాజు, అవురోజు నరసింహ, జంపాల లింగయ్య, బెలిజా శంకర్, దాసరి యాదయ్యతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్మకన్నె గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

సిపిఎం బండ శ్రీశైలం



**గట్టుప్పల్, ప్రభాతసూర్య ఆగస్టు 28:** వెల్మకన్నె గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. గురువారం గట్టుప్పల మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో సిపిఎం ఇంటింటి కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బండ శ్రీశైలం మాట్లాడుతూ, నల్లగొండ డిపో నుండి వెల్మకన్నె మీదుగా చౌటుప్పల్ వరకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం బస్సు సర్వీసులు నడపాలని, గట్టుప్పల్ రోడ్డు నుండి స్కూల్ వరకు, చాపల మారయ్య ఇంటి నుండి సెంటర్ వరకు సీసీ రోడ్లు వేయాలని, గ్రామంలోని 10 వార్డులలో మురికి కాలువలు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో రహదారులు గుంతల మయమై ప్రయాణం కష్టమవుతుందని, కొన్ని కాలనీల్లో ఇప్పటికీ సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్లుగా ప్రజా సమస్యలను పరిష్కరించకుండా భావోద్వేగాలను రెచ్చగొడుతూ విధ్వంస పాలన కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం వలన గ్రామ సమస్యలు మరింత పెరిగాయని అన్నారు. చీకటిమామిడి మెయిన్ లైన్ కారణంగా వెల్మకన్నె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే గట్టుప్పల మెయిన్ లైన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చాపల మారయ్య, నాయకులు టేకుమెట్ల కృష్ణ, పడసబోయిన యాదగిరి, అబ్బయ్య, అంజయ్య, గంగన్న, గోని మహేష్, రేవెల్లి సత్తయ్య, లింగయ్య, నరసింహ, పడసబోయిన రాములు, పడసబోయిన లింగయ్య, చాపల రమేష్, వరికుప్పల నరసింహ, దోటి వెంకటేశం, చిక్కుల బుచ్చయ్య, వల్లూరు అంజయ్య, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం సిపిఎం పార్టీ డిమాండ్





**ఇబ్రహీంపట్నం, ప్రభాత సూర్య ఆగస్టు 28:** ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని 3, 4వ వార్డుల ప్రజల సమస్యలపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి చింతపట్ల ఎల్లేశ్ మాట్లాడుతూ 4వ వార్డులో కొంగ్రు ఇబ్రహీం ఇంటి నుండి కొంగ్రు బిక్షపతి ఇంటి వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం, నాగిళ్ల అంజమ్మ ఇంటి నుండి కొంగ్రు సంతోష్ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం, 3వ వార్డులో సాలే నరసింహ ఇంటి నుండి నాల్కె భారతమ్మ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం అత్యవసరమని అన్నారు. అలాగే, బండి నరసింహారావు ఇంటి దగ్గర 10 ఏళ్లుగా డ్రైనేజీ లీకేజీ వల్ల మురికివాసనతో పాటు రోగాలు వచ్చే ప్రమాదం ఉందని, కాబట్టి బండి నర్సింగరావు నుండి అనుమండ్ల యాదగిరి ఇంటి వరకు పెద్ద డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కాలనీ (3వ జగ్జీవన్‌రావు కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయాయని, వీటిని వెంటనే పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. “మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలి” అని ఎల్లేశ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిటీ సభ్యులు యెలామోని స్వప్న, సిపిఎం నాయకులు మల్లెల దశరథ, డొంకి నరసింహ, మల్లెల నరసింహ, కొంగ్రు సుధాకర్, రెడ్డి మల్ల యాదయ్య, బొడ్డు బిక్షపతి, శాస్త్రి యాదయ్య, బొడ్డు మహేష్, చింతపట్ల ప్రమోద్, దాసు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం మహా ధర్నాను విజయవంతం చేయాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుబూర్గు కృష్ణారెడ్డి



**చౌటుప్పల్.ఆగస్టు 28. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండల వ్యాప్తంగా ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని వచ్చే నెల సెప్టెంబర్ 1న చౌటుప్పలమండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న మహా ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సిపిఎం చౌటుప్పల మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ... గ్రామాల్లో పాలకపక్షం లేకపోవడం వల్ల అనేక సమస్యలు పేరుకపోయాయని అన్నారు. ప్రధానంగా మంచినీళ్లు, విద్యుత్తు, మురికి కాలువలు లాంటి సమస్యలు గ్రామాలలో పెద్ద ఎత్తున తిష్ట వేశాయని తెలిపారు. గత కొద్ది రోజుల నుండి పడుతున్న వర్షాలకు రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండలంలో ఉన్న విషపూరితమైన కెమికల్ కంపెనీలతో వచ్చే విష కాలుష్యంతో ఊపిరితిత్తులు, గుండె సమస్యలు, కిడ్నీ సమస్యలు, కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులతో అనేక రకంగా ఇబ్బంది పడుతున్న ప్రజలను పట్టించుకునే నాధుడే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు సమస్యలు పరిష్కరించమంటే అప్పులు చేసి ఎంతకాలం పనులు చేపించాలని ఆవేదన పడుతున్నారని అన్నారు. గ్రామాల ఇన్చార్జి అధికారులు పేరుకు తప్ప వారు గ్రామాలను సందర్శించే పరిస్థితి లేదని విమర్శించారు. మరో పక్క కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు ఇచ్చారని ఒకటి రెండు తప్ప ఏ ఒక్కటి సరిగ్గా అమలు జరపలేదని అన్నారు. గ్రామాలలో పెన్షన్స్, అందరికీ ఇందిరమ్మ ఇల్లు, వ్యవసాయతర కుటుంబాలకు 12,500 రూపాయలు, దళితులకు అంబేద్కర్ పథకం, గ్యాస్ సబ్సిడీ, మహిళలకు 2500 వందల ఆర్థిక సహకారం లాంటివి అమలు చేయడం లేదని అన్నారు. ఈ వాగ్దానాలను అమలు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలో రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు కార్మికులు మహిళలు యువకులు , పేదలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు . ఈ సమావేశంలో మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తడక మోహన్, చింతల సుదర్శన్,బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు,అంతటి అశోక్,చెరుకు లక్ష్మమ్మ, పల్లె మధు కృష్ణ, ఆదిమూలం నందీశ్వర్, జక్కిడి దేవేందర్ రెడ్డి, కొండే శ్రీశైలం, బోదాస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కృషి నగర్ వరద కాల్వ పనులను పరిశీలించిన కార్పొరేటర్ శ్రీ కాంత్..



శేరిలింగంపల్లి ప్రభాత సూర్య : మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషి నగర్ నారాయణ కాలేజీ నుండి దీప్తి శ్రీనగర్ కాలనీ వరకు రూ 43 లక్షల రూపాయల అంచనావ్యయం తో నూతనంగా నిర్మాణం చేపట్టినటువంటి వరద నీటి కాలువ నిర్మాణం పనులను చందానగర్ డివిజన్ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి తో కలిసి పరిశీలించిన మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ... కృషినగర్ నారాయణ కాలేజ్ నుండి దీప్తి శ్రీ నగర్ కాలనీ వరకు, వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కొరకై చేపట్టినటువంటి వరద నీటి కాల్వ నిర్మాణం పనులను సీనియర్ నాయకులు రఘునాథ రెడ్డి తో కలసి పరిశీలించడం జరిగినదని, వరద నీరు కాల్వ నిర్మాణం పనులు త్వరలో పూర్తిచేసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నో ఏండ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయడం జరుగుతుంది అని, మియాపూర్ డివిజన్ చందా నగర్ డివిజన్ పరిధిలోని చుట్టుపక్కల కాలనీ వాసులకు ఎంతో మంది ప్రయాణికులకు, వాహనదారులకు లబ్ధి చేకూరునని తెలిపారు, మియాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామని ప్రజలకు అన్ని రకాల మౌళికవసతుల కల్పనకు కృషి చేస్తాం అని, మౌళికవసతులు కల్పించడంలో ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తకుండా చూస్తామని కార్పొరేటర్ శ్రీకాంత్ ఈ సందర్భంగా తెలిపారు.

## దండు మల్కాపురం కుమ్మరి సంఘం అధ్యక్షులుగా మల్కాజిగిరి నరసింహ నియామకం



**చౌటుప్పల్. ఆగస్టు 28. ప్రభాత సూర్య :**చౌటుప్పల్ మండలం, దండు మల్కాపురం గ్రామంలో గ్రామ కుమ్మర సంఘం కమిటీని చౌటుప్పల్ మండల కుమ్మరి సంఘం కన్వీనర్ సిలివేరు శ్రీనివాస్, కో కన్వీనర్లు తాడూరు వెంకటేష్, సిలివేరు వెంకటేష్, సిలివేరు నరేష్, తీగుళ్ల నరసింహ, అంజయ్య ల ఆధ్వర్యంలో గురువారం గ్రామ నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. దండు మల్కాపురం గ్రామ నూతన అధ్యక్షులుగా మల్కాజిగిరి నరసింహ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా చిలువేరు గణేష్, గౌరవ అధ్యక్షులుగా మల్కాజిగిరి బాబు, అంజయ్య, చిలువేరు వెంకటేశం, కాశయ్య, ఉపాధ్యక్షులుగా చిలువేరు బిక్షపతి, కోశాధికారిగా మల్లేశం, కార్యదర్శిగా మల్కాజ్గిరి గిరివర్ధన్ లను ఎన్నుకోవడం జరిగిందని చౌటుప్పల్ మండల కుమ్మరి సంఘం కన్వీనర్ సిలువేరు శ్రీనివాస్ తెలిపారు . ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మల్కాజ్గిరి నరసింహ మాట్లాడుతూ.. కుమ్మరి కులంలో ఉన్న సమస్యల గురించి తన వంతు సహకారం చేస్తానని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన గ్రామ కులస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ మల్కాజ్గిరి కృష్ణ, శంకర్, పాపయ్య, నరసింహ, కాశయ్య, లింగస్వామి, శ్రీశైలం, అంజయ్య, మల్లేష్ తదితర కుమ్మరి పెద్దలు పాల్గొన్నారు.

## తూప్రాన్ పేట కుమ్మరి సంఘం అధ్యక్షులుగా పూసుకూరి సాయిలు నియామకం



**చౌటుప్పల్.ఆగస్టు28. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మండలం, తూప్రాన్ పేట గ్రామంలో గ్రామ కుమ్మర సంఘం కమిటీని చౌటుప్పల్ మండల కుమ్మరి సంఘం కన్వీనర్ సిలివేరు శ్రీనివాస్, కో కన్వీనర్లు తాడూరు వెంకటేష్, సిలివేరు వెంకటేష్, సిలివేరు నరేష్, తీగుళ్ల నరసింహ, అంజయ్య ల ఆధ్వర్యంలో బుధవారం గ్రామ నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. తూప్రాన్ పేట గ్రామ నూతన అధ్యక్షులుగా పూసుకూరి సాయిలు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా పూసుకూరి కుమార్, గౌరవ అధ్యక్షులుగా పూసుకురి సైదులు, ఉపాధ్యక్షులుగా పూసుకూరి పురుషోత్తం, కోశాధికారిగా రమేష్ లను ఎన్నుకోవడం జరిగిందని చౌటుప్పల్ మండల కుమ్మరి సంఘం కన్వీనర్ సిలివేరు శ్రీనివాస్ తెలిపారు . ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ.. కుమ్మరి కులంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం చేస్తానని తెలిపారు. కుల సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన గ్రామ కులస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదమ్మ, యాదయ్య, మహేష్, అనసూయ తదితర గ్రామ కుమ్మరి కులస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి



**చౌటుప్పల్.ఆగస్టు 28. ప్రభాత సూర్య :**చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రినీ గురువారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సందర్శించి రోగులను వారికి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రిలో విష జ్వరాల బారిన పడి అనేకమంది రోగులు వస్తున్న డాక్టర్లు కనీసం వారిని థర్మామీటర్, బీపీ చెకప్ ఏమి చేయకుండా వారు రాగానే వారిని కరోనా పేషంట్ లాగా దూరం నిలబెట్టి మందులు రాసి పంపడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత రోగులు వచ్చిన వారిని చూడకుండా టైం అయిపోయిందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పుకుంటూ వెళ్ళిపోతున్నారన్నారని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ప్రైవేటు హాస్పిటల్ ల్లను నిర్వహిస్తున్న డాక్టర్లపై చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉడత రామలింగం, కొండూరు వెంకటేష్, రొండి నరసింహ, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్



**చౌటుప్పల్.ఆగస్టు 28.ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండలం,పెద్ద కొండూరు గ్రామంలోని చెరువులో జిల్లాకలెక్టర్ ఆదేశానుసారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో విగ్రహాల నిమజ్జనాన్ని వచ్చేనెల 5, 6 న పెద్ద కొండూరు చెరువు నందు చేయుటకై నిర్ణయించడమైనది. ఇందులో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రామిరెడ్డి గురువారం పెద్ద కొండూరు చెరువు వద్ద కట్టమీద ఉన్నటువంటి పిచ్చి మొక్కలను, కంపచెట్లను తొలగించి, రోడ్డు కు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా గణేష్ నిమజ్జన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. రోడ్ల మీద ఉన్న గుంటలను సరి చేయాల్సిందిగా, బారికేడ్లను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఆర్ అండ్ బి ఏ.ఈ కి మున్సిపల్ కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అంజయ్య , ఆర్వో శ్రీధర్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, పెద్ద కొండూరు పంచాయతీ సెక్రెటరీ శ్రీశైలం , టీ డబ్ల్యూ ఐ లు సంతోష్,సునిల్, జవాన్ అంజయ్య పాల్గొన్నారు.

# ప్రయాణికుల ప్రాణాలు పోతున్న పాలకులకు పట్టదా..?

ఇంకా ఎందరి ప్రాణాలు పోతి స్పందిస్తారు...?

నీళ్లు పోవడానికి తక్షణం నాగిరెడ్డిపల్లి నందనం మధ్యన ఉన్న జాతీయ రహదారిపై హై లెవెల్ బ్రిడ్జిని నిర్మాణం చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ డిమాండ్





**భువనగిరి, ఆగష్టు 28( ప్రభాత సూర్య):** చిట్యాల నుండి భువనగిరి మీదుగా జగదెపూర్ వరకు ప్రయాణికులు, మీద వెహికల్స్ వెల్లె ప్రధాన జాతీయ రహదారి భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి, నందనం గ్రామాల మధ్యన ఉన్న బ్రిడ్జిని వెడల్పు, ఎత్తు లేకపోవడంతో వచ్చిన వరదతో ప్రయాణికుల ప్రాణాలు పోగొట్టుకుంటున్న పాలకులకు పట్టదా..? ఇంకా ఎన్ని ప్రాణాలు పోతే పాలకులు స్పందిస్తారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి. జహంగీర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా నాగిరెడ్డిపల్లి నందనం గ్రామాల మధ్యన జాతీయ రహదారి పైన నీళ్లు పోవడానికి తక్షణం హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేసి ప్రజల ఆధ్వర్యంలో నందనం నాగిరెడ్డిపల్లి మధ్యన రోడ్డుపై నుంచి నీళ్లు పోతున్న ప్రాంతాన్ని సందర్శించిన అనంతరం "నిరసన " కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ గత 10 నుంచి 12 సంవత్సరాలుగా నాగిరెడ్డిపల్లి నందనం మధ్యన రోడ్డ నుండి నీళ్లు పోవడానికి ఉన్న బ్రిడ్జి సరిపోకపోవడంతో అనేకసార్లు చిన్న వర్షానికి కూడా వాహనాలు ప్రయాణికులు రోడ్డు దాటడంలో ఇబ్బందులు పడుతున్నారని, ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. భువనగిరి పట్టణం మొదలుకొని మండల పరిధిలోని 10 గ్రామాలకు పైగా చెరువులు నుండి అలుగులు పోయడంతో ఆ నీళ్లు మొత్తం కూడా ఈ జాతీయ రహదారి పైన చిన్న బ్రిడ్జి నుండి నీళ్లు అవతలి భాగం పోవడానికి లోతు వెడల్పు సరిపోక రోడ్డు పైనుండి నీళ్లు వెళుతున్నాయని నీళ్ల లోతు ప్రయాణికులకు సరైన అవగాహన లేక నీళ్లు దాడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. పాలకులు వర్షాలకు నీళ్లు వచ్చినప్పుడు ప్రజలు, రాజకీయ పార్టీలు ఆందోళన చేసినప్పుడు కంటి తడుపు చర్యలు తప్ప పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి పలుమార్లు సిపిఎం ఆధ్వర్యంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరిన పట్టించుకోవడంలేదని అన్నారు. వివిధ జిల్లాలను రాష్ట్రాలను కలుపుతూ కొనసాగుతున్న ఈ జాతీయ రహదారి చాలా కీలకమైనదని, వందలాది ట్రాన్స్పోర్ట్ వెహికల్స్, వేలాదిమంది ప్రయాణికులు ఈ రోడ్డు వెంబడి నిత్యము రాకపోకలు కొనసాగిస్తారని ఇలాంటి రోడ్డు విషయంలో పాలకులు నిర్లక్ష్యంగా ఉన్నారని అన్నారు. గత రెండు రోజులుగా ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యులతో పాటు జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం స్పందించి హై లెవెల్ బ్రిడ్జిని తక్షణం నిర్మాణం చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని జహంగీర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, భువనగిరి మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, మండల నాయకులు వడ్డబోయిన వెంకటేష్, గునుగుంట్ల శ్రీనివాస్, అబ్దుల్లాపురం వెంకటేష్, కొండపురం యాదగిరి, జిట్టా అంజిరెడ్డి, ఎదునూరి వెంకటేష్, సురుపంగా ప్రకాష్, ఆయా గ్రామాలకు సంబంధించిన సిపిఎం సభ్యులు కడారి కృష్ణ, ఎండి. జహంగీర్, కొల్లూరి సిద్దిరాజు, మొగిలిపాక సుధాకర్, గంగదారి గణేష్, బీస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని సమస్యల్ని పరిష్కరించాలి

-సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా



**చౌటుప్పల్.ఆగస్టు 28.ప్రభాత సూర్య :** చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా అన్నారు. గురువారం సిఐటియు జిల్లా కమిటీ పిలుపుమేరకు సిఐటియు ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని ప్రభుత్వ ఆసుపత్రిని సర్వేలో భాగంగా సందర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ...చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళలకు ఈసీజీ తీయడానికి మహిళ టెక్నీషియన్ లేకపోవడం వలన ఆసుపత్రికి వచ్చినటువంటి మహిళలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. చౌటుప్పల్ లో పెద్ద పెద్ద కంపెనీలు ఉండడం వలన జాతీయ ప్రధాన రహదారి 65 వెంట జరిగిన రోడ్డు ప్రమాదాలు జరిగి క్షతగాత్రులు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వస్తే కెపాసిటీ తక్కువ ఉన్న అటువంటి ఎక్స్రేరే మిషన్ వల్ల ప్రమాదాలు జరిగిన పేద వాళ్లకు ఎక్స్రేరే లు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని అన్నారు. కనీసం షుగర్ పేషెంట్లకు ఇన్సులిన్, మందులు కూడా అందుబాటులో లేక పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే జిల్లా ఆసుపత్రి అధికారులు స్పందించి చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, బత్తుల దాసు, గడ్డం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి పూజలు



**చౌటుప్పల్.ఆగస్టు 28.ప్రభాత సూర్య:** చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని గాంధీ పార్క్ ఆవరణలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాన్ని ప్రతిష్టించి ఘనంగా భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో భాగంగా పలువురు నాయకులు పాల్గొని పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బత్తుల శ్రీశైలం మాట్లాడుతూ... వినాయక పండుగను అన్ని వర్గాల వారు కలిసి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తొమ్మిది రోజులపాటు విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో పూజించటం వలన యువతలో భక్తి భావం ఏర్పడడం వలన భవిష్యత్తులో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ అధ్యక్షుడు గుజ్జుల సురేందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, రామాలయం కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, పోలోజు శ్రీధర్ బాబు, తాడూరు పరమేష్, మంచి కంటి భాస్కర్,మాజీ గ్రంథాలయం చైర్మన్ ఉడుగు మల్లేష్ గౌడ్, మొగుదాల రమేష్, జక్కర్తి శేఖర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, ఊడుగు వెంకటేష్, రాజపేట అశోక్, మల్లేష్ గౌడ్, కాసుల వెంకటేశం, అన్నమోని గోవింద్ రాజ్, బొడ్డు రాజేందర్ రెడ్డి, పోలోకి భాస్కర్, మహిళా భక్తులు, పెద్ది సుధాకర్ శర్మ పాల్గొన్నారు.


# శివన్నగూడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎప్పుడు?

అనంతరాజు గౌడ్




**మర్రిగూడ, ఆగస్టు 28:( ప్రభాత సూర్య)** శివన్నగూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు విషయంలో ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మర్రిగూడ మాజీ ఎంపీపీ అనంతరాజు గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన తెలిపారు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలోనే ఇప్పటికే 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటై వైద్యసేవలు అందిస్తోందని, ఇలాంటి పరిస్థితుల్లో ఒకే గ్రామంలో రెండు వైద్య కేంద్రాలు ఉండడం వల్ల ప్రజలకు అసలు ప్రయోజనం ఉండదని గుర్తించిన అధికారులు, %ూఎజ%ని శివన్నగూడ గ్రామానికి తరలించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. శివన్నగూడలో ఏర్పడితే పరిసర గ్రామాలైన ఖుదబక్షపల్లి, వెంకపల్లి, చర్లగూడం, రాం రెడ్డిపల్లి, నర్సిరెడ్డిగూడం, అంతంపేట, ఇందుర్తి, కొట్టాల, నామాపురం, సరంపేట, లెక్కలపల్లి గ్రామాల పేద ప్రజలకు సుమారు 20,000 మందికి ప్రభుత్వ వైద్యసదుపాయం అందుబాటులోకి వస్తుందని ఆయన గుర్తుచేశారు. కానీ అధికారుల ఆదేశాలు వచ్చినా ఇప్పటివరకు ఎలాంటి ఏర్పాట్లు జరగలేదని, దీంతో ఆ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాలేక ప్రైవేటు ఆసుపత్రుల ద్వారానే వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని, దీని వల్ల పేదలు ఆర్థికంగా కష్టాల్లో పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే శివన్నగూడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి, తగిన వసతులు కల్పించాలి. దీనికి అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలి” అని అనంతరాజు గౌడ్ డిమాండ్ చేశారు.

## ఘనంగా గణపయ్య పూజలు



**మద్దూర్ ఆగస్టు 28 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బుధవారం రోజు గణపయ్య పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు పిండి వంటలతోని పాయసాలు తయారుచేసి ఘనపయ్యకు నైవేద్యం సమర్పించారు. మండల కేంద్రంలో వీధి వీధిలో ఘనపయ్యలు ప్రతిష్టించారు. ఎప్పుడు లేని విధంగా మండల కేంద్రంలో రావులపల్లి రోడ్డులో 35 ఫీట్ల గణపతిని ప్రతిష్టించారు.

## ఓటర్ లిస్ట్ జాబితా విడుదల




**మద్దూర్ ఆగస్టు 28 ప్రభాత వార్త** నారాయణపేట జిల్లా ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల ఓటర్ లిస్ట్ జాబితాను మండల అధికారులు గురువారం రోజు విడుదల చేశారు. ప్రతి గ్రామపంచాయతీ దగ్గర ఈ జాబితాను నోటీసు బోర్డులో ఉంచడం జరుగుతుందని వారు తెలిపారు. ఎవరికైనా ఎటువంటి డౌట్లు ఉన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో రహిమనతుద్దీన్ తెలియజేశారు

## వెల్మకన్నె లో అంబేద్కర్ గణేష్ ఉత్సవ కమిటీ పూజా కార్యక్రమం



**గట్టుప్పల్, ప్రభాతసూర్య ఆగస్టు 28:** మునుగోడు నియోజకవర్గం గట్టుప్పల్ మండలం వెల్మకన్న గ్రామంలో అంబేద్కర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనీయంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ ఉపాధ్యక్షులు గోసుకొండ వెంకటేష్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. వెల్మకన్నె గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై గణపతి బప్పా మొరియా నినాదాలతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా సాగింది.

## గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్



**మద్దూర్ ఆగస్టు 28 ప్రభాతవార్త** మద్దూర్ గురుకుల పాఠశాలను అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ గురువారం రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతోని అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా బోధన ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులతో కూర్చొని భోజనం చేశారు. జిల్లాలోని ఈ పాఠశాల నెంబర్ వన్ స్థాయిలో ఉండాలని విద్యార్థులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎంపీడీవో రైమదుబ్బుద్దిన్, పాఠశాల ప్రిన్సిపాల్ అనిలా 10 ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## వీధి కుక్కల నుంచి తగిన రక్షణ చర్యలు...!



**చౌటుప్పల్.ఆగస్టు 28. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ పట్టణం మందలి వివిధ వార్డుల్లో ఉన్న కుక్కల బెడద కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా గురువారం 7,14,17,18వ వార్డులలో స్వతంత్ర ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీ వారి సహకారంతో మొత్తం 29 కుక్కలను పట్టుకోవడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ప్రజలు వీధి కుక్కల బారిన పడకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.వాటికి స్టెరిలైజేషన్ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి, వ్యాక్సినేషన్ అనంతరం మరలా వదిలిపెడతారని తెలిపారు. పట్టణ ప్రజలు వీధి కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ప్రత్యేకంగా చిన్నపిల్లలు వీధి కుక్కల బారిన పడకుండా కుటుంబ పెద్దలు, పాఠశాల యాజమాన్యాలు, యువజన సంఘాలు, ప్రతి పౌరుడు బాధ్యతగా భావించి చిన్న పిల్లల్ని రక్షించుకోవాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో స్వతంత్ర ఎనిమల్ వెల్ఫేర్ అసోసియేషన్ డాక్యాచేర్స్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, జవాన్ నరసింహ, సిబ్బంది నరసింహ, అంజయ్య, నరసింహ పాల్గొన్నారు.

బిజినెస్

## వెండి కూడా బంగారం లెక్కనే.. అమల్లోకి రానున్న కొత్త రూల్స్..




కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వెండి ఆభరణాలకు కూడా బంగారం మాదిరిగానే హాల్‌మార్కింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టనుంది. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 1 నుండి అమల్లోకి రానుంది. ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశ్యం కస్టమర్లు కొనుగోలు చేసే వెండికి స్వచ్ఛత హామీ ఇవ్వడం. ప్రస్తుతానికి ఈ హాల్‌మార్కింగ్ స్వచ్ఛందంగా ఉంటుంది. అంటే వినియోగదారులు కోరుకుంటే హాల్‌మార్క్ చేసిన వెండిని కొనుగోలు చేయవచ్చు లేదా హాల్‌మార్క్ లేని వెండిని కూడా కొనవచ్చు. అయితే భవిష్యత్తులో ఇది తప్పనిసరి అయ్యే అవకాశాలు లేకపోలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బంగారం విషయంలో హాల్‌మార్కింగ్ తప్పనిసరి అయినట్లే, వెండికి కూడా ఇదే విధానం అమలులోకి రావచ్చని భావిస్తున్నారు. హాల్‌మార్కింగ్ వల్ల వెండి ఆభరణాల ధరలు పెరుగుతాయా అనే సందేహం చాలా మందిలో ఉంది. అయితే దీని వల్ల ధరలపై ప్రత్యక్ష ప్రభావం ఉండదని నిపుణులు చెబుతున్నారు. కానీ వినియోగదారుల్లో నాణ్యత పట్ల విశ్వాసం పెరిగి, హాల్‌మార్క్ చేసిన వెండికి డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. హాల్‌మార్క్ అనేది వినియోగదారుడు కొనుగోలు చేస్తున్న వెండి ఎంత స్వచ్ఛమైనదో తెలియజేసే ఒక ప్రామాణికత ముద్ర. ఇది కొనుగోలులో మోసం జరిగే అవకాశాలను తగ్గించి, వినియోగదారులు తమ డబ్బుకు పూర్తి విలువ పొందేలా చేస్తుంది.

## 2038 నాటికి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్!



2038 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 34.2 ట్రిలియన్ డాలర్ల +ఞూతో? ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించవచ్చని, 2030 నాటికి కొనుగోలు శక్తి సమానత్వం పరంగా 20.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. 2030 తర్వాత, భారత్ అమెరికా 2028-2030లో వరుసగా 6.5 శాతం, 2.1 శాతం సగటు వృద్ధి రేటును కొనసాగిస్తే ×వీఖీ అంచనాల ప్రకారం 2038 నాటికి భారతదేశం ూూా పరంగా అమెరికా ఆర్థిక వ్యవస్థను అధిగమించవచ్చు. ఈ నెల ప్రారంభంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాతో పాటు భారతదేశాన్ని 'డెడ్ ఎకానమీ' అని అభివర్ణించారు. కానీ, వాస్తవ లెక్కలు చూస్తే 2028 నాటికి మార్కెట్ మారకం రేటు పరంగా భారత్ జర్మనీని అధిగమించి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని కూడా అంచనా. తగిన ప్రతిఘటనలతో ఎంపిక చేసిన భారతీయ దిగుమతులపై అమెరికా విధించే అధిక సుంకాల ప్రతికూల ప్రభావాన్ని భారతదేశం వాస్తవ %+ఞూ% వృద్ధికి దాదాపు 10 బేసిస్ పాయింట్లకు పరిమితం చేయగలదు. ప్రపంచంలోని ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో భారత్ అత్యంత డైనమిక్‌గా ఎదుగుతోందని, అధిక పొదుపు, పెట్టుబడి రేట్లు, అనుకూలమైన జనాభా, స్థిరమైన ఆర్థిక స్థితి వంటి బలమైన ఆర్థిక పునాదులతో భారత్ ఎదుగుతోందని %జ్% ఎకానమీ వాచ్ ఆగస్టు 2025 సంచిక తెలిపింది. సుంకాల ఒత్తిళ్లు, వాణిజ్యం మందగించడం వంటి ప్రపంచ అనిశ్చితులు ఉన్నప్పటికీ, భారత్ స్థితిస్థాపకత దేశీయ డిమాండ్‌పై ఆధారపడటం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలలో సామర్థ్యాలను పెంచడం నుండి ఉద్భవించిందని అది తెలిపింది.

# డిమార్ట్ - రిలయన్స్ రిటైల్.. చౌకైన షాపింగ్ కోసం ఏది బెస్ట్?




డీమార్ట్ ఈ పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది తక్కువ ధరలకే లభించడం. సామాన్యుల నుంచి ఉన్నత వర్గాల వరకు ఎంత దూరమైన వెళ్లి డీమార్ట్‌లోనే షాపింగ్ చేస్తుంటారు. ప్రతి రోజు అన్ని రకాల వస్తువులపై ఆఫర్లు అందిస్తుంటారు. ఇతర సూపర్ మార్కెట్లో కంటే డీమార్ట్‌లో తక్కువ ధరలకే నిత్యవసర సరుకులతో పాటు ఇతర అన్ని సరుకులు లభిస్తాయి. అలాగే ఏ వస్తువు అయినా చేతికి అందేలా సులభంగా లభిస్తాయి. మార్ట్‌లో మొత్తం తిరుగుతూ కావాల్సిన సరుకులన్ని తీసుకోవచ్చు. ఇక రోజువారీ అవసరాలకు సంబంధించిన వస్తువులపై ఎక్కువ ఆఫర్లు అందిస్తుంటారు. అలాగే ప్యాకింగ్ కూడా సింపుల్‌గా ఉంటుంది. కానీ ధర వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. ఎక్కువగా మధ్యతరగతి కుటుంబాలు డీమార్ట్‌కు వెళ్తుంటారు. డీమార్ట్‌లో అన్ని వస్తువులు కూడా తక్కువ ధరల్లోనే లభిస్తాయి. ఇక రిలయన్స్ రిటైల్ షాపులు దేశంలో చాలా ప్రాంతాల్లో ఉన్నాయి. ఇవి కేవలం కిరాణా సరుకులు మాత్రమే కాకుండా ఫ్యాషన్, ఎలక్ట్రానిక్స్, లైఫ్‌స్టైల్ ప్రొడక్ట్స్ వరకు లభిస్తాయి. ఇక్కడ ఎక్కువగా బై వన్ గెట్ వన్ 1 ఫ్రీ లేదా భారీ ఫెస్టివల్ ఆఫర్లు ఉంటాయి. ఒకే చోట అన్ని రకాల వస్తువులు లభిస్తాయి. పెద్ద షాపింగ్ మాల్స్‌లో లగ్జరీ షాపింగ్ అనుభవం ఉంటుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలో సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అయితే, రిలయన్స్ రిటైల్‌లో వస్తువుల ధరలు కొన్నిసార్లు మార్కెట్ ధరలతో సమానంగా లేదా కొంచెం ఎక్కువగా ఉండవచ్చు. కానీ కానీ బల్క్ ఆఫర్లు లేదా ఫెస్టివల్ సేల్ సమయంలో మాత్రం కాస్త ఎక్కువ లాభం పొందే అవకాశం ఉంటుంది. ఇక్కడ రోజు వారీ అవసరాలకు ఉపయోగించే బియ్యం, ఆయిల్, పప్పులు వంటివి డీమార్ట్ కంటే కొంత తక్కువ ధరల్లోనే లభిస్తుంటాయి. ఇక రోజువారీ షాపింగ్ చేయాలనుకునే వారికి డీమార్ట్ బెస్ట్ అని చెప్పవచ్చు. ఇక ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ సంబంధించిన వస్తువులు కావాలంటే రిలయన్స్ రిటైల్‌లో ఎక్కువ ఆఫర్లు ఉంటాయి. ఫెస్టివల్ సీజన్ ఆఫర్ల విషయానికి వస్తే రిలయన్స్ రిటైల్‌లో భారీ డిస్కౌంట్లు వస్తాయి. తక్కువ ధరలో రోజువారీ అవసరాల కోసం వస్తువులను కొనుగోలు చేయాలంటే డీమార్ట్ మంచి ఆప్షన్ అని చెప్పవచ్చు. ఫ్యాషన్, ఎలక్ట్రానిక్స్ లేదా పెద్ద ఆఫర్లు కావాలనుకునే వారికి రిలయన్స్ రిటైల్ సరైన ఎంపిక చెప్పుకోవచ్చు. అందుకే ఈ రెండింటిలోను ఆఫర్లు ఉంటాయి. కానీ మీ అవసరాలను బట్టి స్టోర్‌ను ఎంచుకోవడం మంచిది. ఒకవేళ మీకు రోజు వారీగా అవసరం అయ్యే వస్తువుల కోసం రెగ్యులర్ షాపింగ్ చేస్తుంటే డీమార్ట్ మొదటి ఆప్షన్. కానీ పండుగ సీజన్‌లో ఫ్యామిలీ షాపింగ్ చేయాలనుకుంటే రిలయన్స్ రిటైల్‌లో ఆఫర్లు ఎక్కువగా లభిస్తాయని చెప్పవచ్చు.

# వరద బాధితులకు జియో, ఎయిర్‌టెల్ సాయం..!




భారీ వర్షాలు, వరదలు అనేక కుటుంబాలను ప్రభావితం చేశాయి. వరద ప్రాంతంలో చిక్కుకున్న వారు కనెక్టివిటీ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో ప్రముఖ టెలికామ్ సంస్థలైన జియో, ఎయిర్‌టెల్ ఈ ప్రాంతంలో చిక్కుకున్న వారికి సహాయం చేయడానికి ముందుకు వచ్చాయి. దేశంలోని వర్షం, వరద ప్రభావిత ప్రాంతాలలోని అన్ని ప్రీపెయిడ్ వినియోగదారులకు జియో 3 రోజుల చెల్లుబాటు పొడిగింపును ప్రకటించింది. దీనితో పాటు వినియోగదారులు రోజుకు 2+దీ హై-స్పీడ్ డేటా, మూడు రోజుల పాటు అపరిమిత వాయిస్ కాల్‌లను పొందుతారు. జియోహోమ్ వినియోగదారులకు, అంతరాయం లేని సేవలను నిర్ధారించడానికి వారికి అదనంగా 3 రోజుల పొడిగింపు అందించబడుతుంది. ఇంతలో జియో పోస్ట్‌పెయిడ్ ఉపయోగిస్తున్న వారికి బిల్లు చెల్లింపులకు 3 రోజుల గ్రేస్ పీరియడ్ లభిస్తుంది, దీని వలన వారు ఎటువంటి సేవా అంతరాయం లేకుండా కాల్ చేయడం, డేటాను ఉపయోగించడం కొనసాగించవచ్చు. ఎయిర్‌టెల్ రోజుకు ఉచిత కాలింగ్, 1+దీ డేటాను అందిస్తుంది. భారతీ ఎయిర్‌టెల్ కూడా ఇలాంటి ఉపశమన ప్రయోజనాలతో ముందుకు వచ్చింది. వరద ప్రభావిత రాష్ట్రాల్లోని ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ కస్టమర్లకు అపరిమిత కాలింగ్, రోజుకు 1+దీ హై-స్పీడ్ డేటాతో 3 రోజుల చెల్లుబాటు పొడిగింపు లభిస్తుంది. ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్, బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు కూడా 3 రోజుల గ్రేస్ పీరియడ్‌ను పొందుతున్నారు, కాబట్టి వారు క్లిష్ట సమయాల్లో అంతరాయం లేని కనెక్టివిటీని ఆస్వాదించవచ్చు. కమ్యూనికేషన్ మద్దతును మరింత బలోపేతం చేయడానికి సెప్టెంబర్ 2 వరకు జమ్మూ కాశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఇంట్రా-సర్కిల్ రోమింగ్‌ను ప్రారంభించాలని ప్రభుత్వం అన్ని టెలికాం ఆపరేటర్లను ఆదేశించింది. దీని అర్థం వినియోగదారులు తమ సొంత ఆపరేటర్ నెట్‌వర్క్ పనిచేయకపోతే అందుబాటులో ఉన్న ఏదైనా టెలికాం నెట్‌వర్క్‌ను స్వయంచాలకంగా లాచ్ చేయగలరు. తీవ్రమైన వరదలు, వర్షాలు, కొండచరియలు విరిగిపడే సమయంలో కూడా అత్యవసర కాల్‌లు, అవసరమైన కమ్యూనికేషన్ సాధ్యమయ్యేలా చూసుకోవడానికి ఈ చర్య తీసుకుంది ప్రభుత్వం.

# రెండో సీడ్‌పై సంచలన విజయం.. క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లిన సింధు



పారిస్ వేదికగా జరుగుతున్న బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అదరగొడుతోంది. తొలి రెండు రౌండ్లలో పోరాడి గెలుపొందిన తెలుగు తేజం ఈసారి రెండోసీడ్‌ను అలవోకగా చిత్తు చేసింది. గురువారం జరిగిన 16వ రౌండ్‌లో చైనాకు చెందిన వాంగ్ జీ యూని మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టిందీ ఒలింపిక్ విజేత. మాజీ ఛాంపియన్ అయిన సింధు బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో జోరు చూపిస్తోంది. తొలి రౌండ్‌లో బల్గేరియాకు చెందిన కలోయనా నల్బంతోవాను ఓడించిన సింధు పదహారో రౌండ్‌లో మలేషియా షట్లర్ కరుపథెవన్‌ను ఇంటికి పంపింది. కీలకమైన ప్రీ క్వార్టర్స్‌లోనూ చెలరేగిన భారత స్టార్ రెండో సీడ్ వాంగ్ జీకి షాకిచ్చింది. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌ను 21-19తో కైవసం చేసుకున్న సింధు.. రెండో సెట్‌లోనూ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు. వాంగ్ పుంజుకుని స్కోర్లు సమం చేసినా తనదైన పవర్ గేమ్‌తో సింధు 21-15తో సెట్ గెలుచుకుంది. ఈ విజయంతో టైటిల్ వేటకు రెండడుగుల దూరంలో నిలిచిందీ బ్యాడ్మింటన్ స్టార్.

స్పోర్ట్స్

# వంద టెస్టులు ఆడినా పట్టించుకోరా.. దిగ్గజ ఆటగాళ్లకు ఘనంగా వీడ్కోలు పలకలేరా..?



భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన క్రికెటర్లు ఒక్కరొక్కరుగా వీడ్కోలు పలుతుకున్నారు. రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ రెండు ఫార్మాట్ల నుంచి తప్పుకోగా.. ఛతేశ్వర్ పుజారా మొత్తంగా మూడింటికీ రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ నేపథ్యంలో.. అత్యంత సీనియర్ ఆటగాళ్లు అయిన వీళ్లకు ఘనమైన వీడ్కోలు లభించకపోవడంపై మాజీలు మండిపడుతున్నారు. దేశం తరఫున వందకు పైగా టెస్టులు ఆడిన కోహ్లీ, పూజారాలకు అద్భుతంగా సెండ్ ఆఫ్ ఇవ్వాల్సింది అని అభిప్రాయపడ్డాడు మాజీ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ వెటరన్ క్రికెటర్ల విషయంలో ఏమీ పట్టనట్టుగా ఉంటున్న బీసీసీఐ తీరుని ఆయన తీవ్రంగా విమర్శించాడు. ఇంగ్లండ్ పర్యటనకు ముందే రోహిత్ టెస్టులకు టాటా చెప్పేయగా.. ఐదు రోజులకే కోహ్లీ కూడా సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు. సుదీర్ఘ కాలం ఆడి.. కెప్టెన్‌గా జట్టుకు చిరస్మరణీయ విజయాలు అందించిన ఇరువురికి ఘనంగా, గౌరవపూర్వకంగా వీడ్కోలు పలకాల్సిందని పలువురు బీసీసీఐకి సూచించారు. తాజాగా నయావాల్ పుజారా కూడా రెండేళ్లుగా టెస్టు ఛాన్స్ కోసం నిరీక్షించి అల్విదా చెప్పాడు. దాంతో.. ఈ ముగ్గురికి గొప్పగా వీడ్కోలు పలకాల్సిన బీసీసీఐ మిన్నకుండిపోవడం సరికాదని యూట్యూబ్ ఛానెల్ వేదికగా శ్రీకాంత్ మండిపడ్డాడు.

### పుజారా, రోహిత్, కోహ్లీ

'దేశం తరఫున 100 టెస్టులు ఆడడం అంటే మామూలు విషయం కాదు. నూరు మ్యాచులు ఆడినవాళ్లంతా గొప్ప ఆటగాళ్లే. అలాంటి వాళ్లకు గౌరవపూర్వకంగా ఘనమైన వీడ్కోలు పలకాలి. అయితే.. రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ సమయంలో బీసీసీఐకి ముందస్తు సమాచారం లేదనే మాటతో ఏకీభవిస్తాను. కానీ.. అధికారులు వాళ్లతో మాట్లాడాల్సింది. కానీ అలా చేయలేదు. కోహ్లీ మరో రెండేళ్లు టెస్టులు ఆడాల్సింది. 'ఇంగ్లండ్ పర్యటనలో సిరీస్ డ్రా చేసుకున్నాం' కాబట్టి కోహ్లీ లేకున్నా పర్లేదని కొందరు అంటున్నారు. ఇప్పుడు పుజారా సైతం పునరాగమనం ఆశలు సన్నగిల్లడంతో నిరాశతో వీడ్కోలు ప్రకటన చేశాడు. ఇంగ్లండ్ పర్యటనలో తనకు చోటు లభిస్తుందని ఆశించిన అతడికి సెలెక్టర్లు షాకిచ్చారు. రిటైర్మెంట్ ఆలోచనతో ఉన్న అతడితో మాట్లాడి ఒక టెస్టు అయినా ఆడించి ఉంటే బాగుండు. కానీ, సెలెక్టర్లు, బీసీసీఐ పెద్దలు పూజారాను అడిగిన పాపాన పోలేదు' అని శ్రీకాంత్ నిప్పులు చెరిగాడు.

### చరిత్రాత్మక విజయాల్లో..

సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్‌కు ఆడిన గొప్ప ఆటగాళ్లలో కోహ్లీ, పుజారా, రోహిత్ కచ్చితంగా ఉంటారు. టాపార్డర్‌లో విలువైన భాగస్వామ్యాలతో జట్టును ఆదుకున్న ఈ ముగ్గురు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ పర్యటనల్లో చరిత్రాత్మక విజయాల్లో భాగమయ్యారు. టెస్టుల్లో టీమిండియాను నంబర్ 1గా నిలిపిన కోహ్లీ 123 మ్యాచ్‌లు ఆడగా.. హిట్‌మ్యాన్ 67, నయావాల్ 103 మ్యాచ్‌ల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించారు.

## అశ్విన్ కీలక నిర్ణయం




భారత వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ నిన్న (ఆగస్ట్ 27) ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదివరకే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అతడు.. భారత క్రికెట్‌తో తన బంధాన్ని పూర్తిగా తెంచుకున్నాడు. ఐపీఎల్ రిటైర్మెంట్ తర్వాత అశ్విన్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఇంగ్లండ్ వేదికగా జరిగే హండ్రెడ్ లీగ్‌లో ఆడేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడని సమాచారం. అలాగే ఆస్ట్రేలియా, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా దేశాల్లో జరిగే టీ20 లీగ్‌ల్లో కూడా పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు పలు ఫ్రాంచైజీలతో సంప్రదింపులు జరుగుతున్నాయట. బీసీసీఐ నియమాల ప్రకారం.. భారత ఆటగాళ్లు అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటిస్తేనే విదేశీ లీగ్‌ల్లో ఆడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం? అశ్విన్‌కు భారత క్రికెట్‌తో కాని, ఐపీఎల్‌తో కాని సంబంధాలు లేవు. కాబట్టి యాష్‌కు విదేశీ లీగ్‌ల్లో ఆడేందుకు లైన్ క్లియర్ అయ్యింది. విదేశీ లీగ్‌ల్లో పాల్గొనాలనుకునే విషయాన్ని అశ్విన్ తన ఐపీఎల్ రిటైర్మెంట్ సందేశంలో పరోక్షంగా ప్రస్తావించాడు. 37 ఏళ్ల ఆశ్విన్ 2009లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేసి, 2025లో అదే ఫ్రాంచైజీ తరఫున తన చివరి మ్యాచ్ ఆడాడు. ఐపీఎల్ కెరీర్‌లో మొత్తం 221 మ్యాచ్‌లు ఆడి 187 వికెట్లు తీశాడు. సీఎస్‌కేతో రెండు టైటిళ్లు సాధించాడు. పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్ వంటి జట్లకు సేవలందించారు. కొన్ని మ్యాచ్‌ల్లో పంజాబ్‌కు కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. 16 సంవత్సరాల పాటు ఐపీఎల్‌లో తన మాయాజాలాన్ని ప్రదర్శించిన అశ్విన్.. త్వరలో విదేశీ లీగ్‌ల్లో కూడా సత్తా చాటేందుకు రెడీ అయ్యాడు.

## బిగ్‌బాస్ 9 షురూ..

## ఈసారి రెండు ఇళ్లు, బిగ్‌బాసే మారుతున్నాడు!





బుల్లితెర ప్రేక్షకుల ఎదురుచూపులకు శుభం కార్డు పడనుంది. తెలుగు బిగ్‌బాస్ 9 షోకి రంగం సిద్ధమైంది. వచ్చేవారమే బిగ్‌బాస్ ప్రారంభం కానుంది. ఈ మేరకు తాజాగా ప్రోమో రిలీజైంది. సెప్టెంబర్ 7న బిగ్‌బాస్ 9 ప్రారంభం కాబోతుందని ప్రకటించింది. ఈసారి కూడా కింగ్ నాగార్జునే ఈ రియాలిటీ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నాడు. 9వ సీజన్ కావడంతో ప్రోమోలో నవగ్రహాలను చూపించారు. అలాగే ఈసారి రెండు హౌస్‌లు ఉంటాయన్నారు. ఒకటి సెలబ్రిటీల కోసం.. మరొకటి కామన్ మ్యాన్ కోసం అని తెలుస్తోంది. అలాగే బిగ్‌బాస్‌నే మారుస్తున్నట్లు చెప్పాడు నాగ్. అంటే బిగ్‌బాస్ వాయిస్ మారొచ్చని తెలుస్తోంది.

**అగ్నిపరీక్ష**

ఇప్పటికే కామన్ మ్యాన్ కోసం సెలక్షన్ జరుగుతోంది. హాట్‌స్టార్‌లో అగ్నిపరీక్ష అనే షో నిర్వహిస్తున్నారు. ఇందులో దాదాపు 15 మంది సెలక్టయ్యారు. వారికి రకరకాల గేమ్స్ పెడుతున్నారు. నచ్చినవారికి ఓట్లేసుకోమని ఆప్షన్ కూడా ఇచ్చారు. ఓట్లు ఎక్కువ వచ్చిన ఒకరిద్దరు కంటెస్టెంట్లను హౌస్‌లోకి పంపించవచ్చని తెలుస్తోంది. అలాగే అగ్నిపరీక్ష షో జడ్జిలైన బిందు మాధవి, నవదీప్, అభిజిత్.. ఇద్దరు, ముగ్గురు కంటెస్టెంట్లను సెలక్ట్ చేసి డైరెక్ట్‌గా పంపించవచ్చని భోగట్టా! మరి హౌస్‌లోకి ఎవరెవరు వెళ్తారో తెలియాలంటే వచ్చేవారం దాకా ఆగాల్సిందే!

## బాలకృష్ణ అఖండ 2 వాయిదా..

## ఓజీతో పోటీ ఉండకూడదనేనా?



టాలీవుడ్ సినీ జనాలతోపాటు వరల్డ్‌వైడ్‌గా తెలుగు మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి అఖండ 2 బాలకృష్ణ బోయపాటి శీను క్రేజీ కాంబోలో విడుదలై బాక్సాఫీస్‌ను షేక్ చేసిన అఖండకు సీక్వెల్‌గా వస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని 2025 సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే రోజులు లెక్కపెట్టుకుంటున్న అభిమానులకు నిరాశ కలిగించే వార్త ఒకటి షేర్ చేశారు మేకర్స్. అఖండ 2 అనుకున్న సమయానికి రావడం లేదు. అవును మీరు చదివింది.. విన్నది నిజమే. పవన్ కల్యాణ్ నటిస్తోన్న ఓజీ సెప్టెంబర్ 25న విడుదలవుతుందని తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్‌తో పోటీ ఉండొద్దనే బోయపాటి టీం ఇలాంటి నిర్ణయం తీసుకుని ఉంటుందని నెట్టింట చర్చ నడుస్తుండగా.. దీనిపై అధికారికంగా మేకర్స్ క్లారిటీ ఇచ్చేశారు. మూవీ ప్రకటించినప్పటి నుంచి ఇండియన్ సినీ ఇండస్ట్రీలో వన్ ఆఫ్ ది మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుగా నిలుస్తోంది అఖండ 2. విడుదలైన అన్ని భాషల్లో టీజర్ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. టీజర్ సినిమాను మరో లెవల్‌కు తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో ప్రేక్షకుల అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా ఉండేందుకు బెస్ట్ అవుట్ పుట్ ఇవ్వడం కోసం మరింత సమయం కావాల్సి ఉంది. రీరికార్డింగ్, వీఎఫ్ఎక్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనుల కోసం టీం నిరంతరం అవిశ్రాంతంగా శ్రమిస్తోంది. ఫస్ట్ పార్టును మించిన సక్సెస్ అందుకునేలా సినిమాను రెడీ చేసేందుకు విడుదల తేదీని మారుస్తున్నాం. కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలియజేశారు. ప్రేక్షకుల ఎదురుచూపులకు సరిపడే వినోదాన్ని అందించేందుకు రెడీ అవుతున్నామని సుదీర్ఘ సందేశాన్ని మూవీ లవర్స్, అభిమానులతో షేర్ చేసుకున్నారు మేకర్స్. అఖండ 2 రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

## గొడవ చేయాలనుకోవట్లేదు.. కానీ, అందుకే తెలుగు సినిమాలు చేయట్లేదు



ఆనంద్ మూవీతో హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయమైంది కమలినీ ముఖర్జీ. స్టైల్, గోదావరి, గమ్యం, గోపి గోపిక గోదావరి.. ఇలా పలు సినిమాల్లో కథానాయికగా నటించింది. చివరగా తెలుగులో గోవిందుడు అందరివాడేలే సినిమాలో కనిపించింది. ఆ తర్వాత రెండు పరభాషా చిత్రాలు చేసిన ఆమె 2016 నుంచి ఇండస్ట్రీకి పూర్తిగా దూరమైంది. తాజాగా తను ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తెలుగులో నేను అన్ని రకాల ఎమోషన్స్ ఉండే అమ్మాయిగా నటించాను. చాలా సినిమాల్లో నేను అమ్మానాన్న లేని అనాథగానే కనిపించాను. బలమైన స్త్రీ పాత్రలు చేశాను. అదే సమయంలో చాలా సున్నితమైన అమ్మాయిగానూ కనిపించాను. కానీ, రానురాను అలాంటి బలమైన క్యారెక్టర్లు నాకు టాలీవుడ్‌లో రాలేదు. గోవిందుడు అందరివాడేలే సినిమాలో నాకు సరైన ప్రాముఖ్యత లేదనిపించింది. మూవీ పూర్తయ్యాక నేను పోషించిన పాత్ర చూసుకుని నాకే ఇబ్బందిగా అనిపించింది. బాధపడ్డాను కూడా! దానికోసం నేను గొడవపడాలని, రచ్చ చేయాలని అనుకోలేదు. అందుకే.. గోవిందుడు అందరివాడేలే తర్వాత తెలుగు సినిమాలు చేయకూడదని నిర్ణయించుకుని టాలీవుడ్‌కు దూరంగా ఉన్నాను. అలా అని నాకు ఎవరిపైనా కోపం లేదు. సినిమాలో చాలా జరుగుతుంటాయి. దర్శకుడు ఓ సీన్ చేయమంటారు. తీరా అది అవసరం లేదనో, బాగోలేదనో దాన్ని ఎడిటింగ్‌లో తీసేస్తుంటారు. ఆ విషయాన్ని మాకు చెప్పరు. ఒక మాటైనా చెప్పకుండా మన సీన్, డైలాగులు తీసేస్తే బాధనిపిస్తుంది. దాన్ని నేను లైట్ తీసుకోలేను. బాధగా అనిపించడంతో తెలుగు సినిమా నుంచి తప్పుకుని ఇతర భాషల్లో చేశాను. మలయాళ మూవీ పులి మురుగన్(2016) తర్వాత నాకు పెళ్లయింది. అందుకే సినిమాలకు దూరంగా ఉన్నాను. చిన్నప్పుడు చదువుకే కేటాయించాను. పెద్దయ్యాక సినిమాలు చేశాను. ఇప్పుడు భార్యగా కుటుంబాన్ని చూసుకోవాలనుకున్నాను అని కమలినీ ముఖర్జీ చెప్పుకొచ్చింది.



## ‘గోలీసోడా’ డైరెక్టర్‌తో రాజ్ తరుణ్ మూవీ.. ట్రైలర్ రిలీజ్

‘గోలీసోడా’, గోలీసోడా-2 చిత్రాల దర్శకుడు,ప్రముఖ కెమెరామెన్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో గోలీసోడా ఫ్రాంఛైజీ లో భాగంగా గోలీసోడాలోని స్పిరిట్‌ను.. ఆ లెగసీని కంటిన్యూ చేస్తూ ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ద్వి భాషా చిత్రగా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో రాజ్ తరుణ్ కథానాయకుడు. ఆయన చిత్రంతో తమిళంలోకి ఎంట్రీ ఇస్తున్నారు. సునీల్, వేదన్, భారత్, అమ్ము అభిరామి, కిషోర్, జెఫ్రీరి, భరత్ శ్రీని, పాల డబ్బా, విజిత తదితరులు ఈ చిత్రంలో ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. రఫ్ నోట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మాణంలో జరుపుకుంటోన్న ఈ చిత్రానికి వినాయక చవితి పర్వదినాన ‘గాడ్స్ అండ్ సోల్జర్’గా టైటిల్‌ని ఫిక్స్ చేసి ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్.. ప్రముఖ తమిళ కథానాయకులు విజయ్ సేతుపతి, విజయ్ ఆంటోని, ఆర్యలతో పాటు మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ తమ ఎక్స్ అకౌంట్ వేదికగా టైటిల్‌ను ట్వీట్ చేసి శుభాకాంక్షలు అందజేశారు. దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ “ గోలీసోడాలోని రఫ్‌నెస్‌ను, న్యూ చాప్టర్‌లో ఈ సినిమాలో ఆడియన్స్ చూడబోతున్నారు. ఈ టైటిల్ టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ టీజర్‌తో మా సినిమాపై ఆడియన్స్‌లో ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగాయి. తప్పకుండా మా చిత్రం తెలుగు, తమిళ భాషల్లో అందరి అంచనాలను అందుకుంటుంది. ఈ సందర్భంగా మా టైటిల్ టీజర్‌ను తమ సోషల్ మీడియాలో షేర్ చేసి మమ్ములను సపోర్ట్ చేసిన అందరికి ధన్యవాదాలు’ అన్నారు. రాజతరుణ్, సునీల్, వేదన్, భారత్, అమ్ము అభిరామి, కిషోర్, జెఫ్రీరి, భరత్ శ్రీని, పాల డబ్బా, విజిత తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ సంగీతం అందిసున్నాడు.



## ఇదేదో విచిత్రంగా ఉందిగా.. ప్రభాస్ తండ్రిగా స్టార్ హీరో

ప్రభాస్ స్పీడ్ చూస్తుంటే మెంటలెక్కుతుంది.. ‘సలార్’, ‘కల్కి’ విజయాలతో ఊపు మీద ఉన్న రెబల్ స్టార్ గ్యాప్ లేకుండా వరుస సినిమాలతో అభిమానులను ఆనందపరిచేస్తున్నారు. భారీ హిట్‌లతో మంచి ఉత్సాహం అందిపుచ్చుకున్న ప్రభాస్ తన కెరీర్‌లో మరింత దూసుకుపోతున్నాడు. ‘సలార్’ విజయం, ఆ తర్వాత ‘కల్కి 2898 ఏ.డి.’ లాంటి పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్ ప్రభాస్ ఖాతాలో చేరడంతో అభిమానుల ఆనందానికి కూడా అవధులు లేకుండా పోయాయి. కల్కి సినిమా రూ.1000 కోట్లకుపైగా వసూళ్లు సాధించి ఇండస్ట్రీలో సంచలనంగా నిలిచింది. ఇప్పుడు ప్రభాస్ ‘రాజా సాబ్’ అనే సినిమా కోసం షూటింగ్ చేస్తున్నాడు. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ హారర్ ఎంటర్టైనర్‌లో ప్రభాస్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నాడు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ సినిమాను జనవరి 9న విడుదల చేయనున్నట్టు సమాచారం. రాజా సాబ్ తర్వాత ప్రభాస్ సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో ‘స్పిరిట్’ అనే సినిమాలో నటించనున్నాడు. ఇప్పటికే టైటిల్ ఫిక్స్ కాగా, ఇందులో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ సినిమాపై ఇప్పుడో ఆసక్తికరమైన వార్త ఇండస్ట్రీలో హల్చల్ చేస్తోంది. స్పిరిట్‌లో ప్రభాస్ తండ్రి పాత్రలో మెగాస్టార్ చిరంజీవి కనిపించబోతున్నారని టాక్. స్పిరిట్ కథలో హీరో తండ్రి పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్టు సమాచారం. యానిమల్ సినిమాలో అనిల్ కపూర్ రణబీర్ తండ్రిగా ఎలా ఆకట్టుకున్నాడో గుర్తుండే ఉంటుంది. అలాగే స్పిరిట్‌లోనూ ఆ స్థాయిలో ఒక పవర్‌ఫుల్ ఫాదర్ రోల్ ఉండబోతుందని, ఆ పాత్ర కోసం చిరంజీవిని సంప్రదిస్తున్నారని ఇండస్ట్రీలో చర్చ. సందీప్ రెడ్డి వంగ ..చిరంజీవిని కలిసేందుకు ప్రయత్నిస్తున్నారట. మెగాస్టార్ ఒప్పుకుంటే ఇది టాలీవుడ్‌లోని మరో భారీ కలయికగా నిలిచే అవకాశం ఉంది. ఈ వార్తపై ఎలాంటి అధికారిక ప్రకటన అయితే లేదు. కానీ చిరు %-% ప్రభాస్ లాంటి ఇద్దరు స్టార్‌లను ఒకే ఫ్రేమ్‌లో చూడాలనేది అభిమానుల కల. ఈ వార్త నిజమైతే, స్పిరిట్ సినిమాపై ఆసక్తి మరింత రెట్టింపు అవుతుంది. ప్రస్తుతం చిరంజీవి .. విశ్వంభర, మన శంకర్ వర ప్రసాద్ గారు చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఇందులో విశ్వంభర వచ్చే ఏడాది సమ్మర్‌కి రానుండగా, మన శంకర్ వరప్రసాద్ గారు సంక్రాంతికి రానుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.